# జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక



సంపుటి :12 సంచిక :361 బుధవారం 2-9-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/




# కన్నీటిలో నేపాల్..

## విధ్వంసం నుంచి ఇంకా కోలుకోని నేపాల్

- వెయ్యి దాటిన మృతుల సంఖ్య
- గల్లంతైన వారు 4వేలకు పైమాటే..
- వేలాది మంది ఆచూకీ కోసం ఎదురుచూపులు
- శిథిలాల కిందే వేలాది ప్రాణాలు..
- కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్

02

హిమాలయాల్లో విరుచుకుపడిన వరదలు నేపాల్‌ను శోకసంద్రంలో ముంచేశాయి. దేశంలో మృతుల సంఖ్య 987కు చేరగా, చైనాలో మరో 16 మంది ప్రాణాలు కోల్పోవడంతో ఈ విపత్తు బలుల సంఖ్య వెయ్యి దాటింది. నాలుగు వేల మందికిపైగా గల్లంతవడంతో వేలాది కుటుంబాలు ఆందోళనలో ఉన్నాయి. ఏడో రోజైనా సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. శిథిలాలు, మట్టి, నీటితో నిండిపోయిన ప్రాంతాల్లో వేలాది మంది సిబ్బంది గాలింపు చేపడుతున్నారు. ముఖ్యంగా హైడ్రోపవర్ ప్రాజెక్టుల వద్ద వందలాది మంది కార్మికులు చిక్కుకుపోయి ఉండవచ్చన్న అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావానికి ఈ విపత్తు మరో హెచ్చరికగా మారగా, గల్లంతైన వారి ఆచూకీ కోసం నేపాల్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా వేలాది కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి.



02

# మళ్లీ గ్యాస్ మంటలు

- కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు పెంపు
- 19 కేజీల సిలిండర్‌పై రూ.9.50 పెరుగుదల
- 14.2 కేజీల గృహ వినియోగ సిలిండర్ ధరలో మార్పు లేదు
- సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త ధరలు

## విజయసాయిరెడ్డిపై సజ్జల దాడి నిజమే..

# చొక్కా పట్టుకుని కొట్టారు..

- నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వెల్లడి
- విజయసాయిరెడ్డిపై సజ్జల దాడి నిజమేనని ధ్రువీకరించిన కోటంరెడ్డి
- మంగళగిరి ప్లీనరీలో స్టేజీ పక్కన ఘటన జరిగిందని వెల్లడి
- చొక్కా పట్టుకుని సజ్జల కొట్టారని సంచలన విషయాల వెల్లడి
- ఈ దాడి గురించి జగన్‌కు తెలిసినా ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారని ఆరోపణ
- విజయసాయి లేఖతో వైసీపీలో మొదలైన అంతర్గత కలహాల దుమారం



**నెల్లూరు, జిల్లా బ్యూరో, కోస్తా లీడర్ :**
తనపై భౌతిక దాడి జరిగిందంటూ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన ఆరోపణలు నిజమేనని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ధ్రువీకరించారు. 2022లో మంగళగిరిలో జరిగిన వైసీపీ ప్లీనరీ సమావేశంలో సజ్జల రామకృష్ణారెడ్డి తనపై దాడి చేశారని, ఈ విషయం అధినేత జగన్‌కు తెలిసినా ఆయన ప్రేక్షకపాత్ర వహించారని విజయసాయిరెడ్డి ఇటీవల ఓ బహిరంగ లేఖలో ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలపై సజ్జల నేరుగా స్పందించనప్పటికీ, అప్పట్లో వైసీపీలో ఉన్న కోటంరెడ్డి ఈ ఘటనపై స్పందించి కీలక విషయాలు బయటపెట్టారు.
మంగళగిరి ప్లీనరీలో వేదికపై ఎవరితో మాట్లాడించాలనే అంశంపై విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగిందని కోటంరెడ్డి తెలిపారు. ఈ క్రమంలోనే స్టేజీ పక్కన ఉన్న రెస్ట్ రూమ్‌లోకి విజయసాయిరెడ్డిని తీసుకెళ్లిన సజ్జల, ఆయన చొక్కా పట్టుకుని కొట్టారని కోటంరెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. అయితే, విజయసాయి రెడ్డి ఎందుకో తిరిగి దాడి చేయలేదని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనతో విజయసాయిరెడ్డి ఆరోపణలకు బలం చేకూరినట్లయింది. విలేకరుల సమావేశంలో మాట్లాడిన కోటంరెడ్డి, విజయసాయిరెడ్డి పేర్కొన్నట్లుగానే ఈ దాడి జరిగిందని స్పష్టం చేశారు.

**వైసీపీలో విజయసాయిరెడ్డికి 72 అవమానాలు..?**

వైసీపీలో తనకు 72 అవమానాలు జరిగాయని విజయసాయిరెడ్డి చెబుతున్నారని, తనకు తెలిసి మరో అవమానం కూడా జరిగిందని కోటంరెడ్డి గుర్తు చేశారు. విజయసాయిరెడ్డి ఒకసారి తాళ్లపూడికి వచ్చినప్పుడు, కాకుపల్లి సెంటర్‌లో ఆయనకు వాహనాలతో ఘనస్వాగతం పలికారని, ఈ విషయం తెలుసుకున్న సజ్జల ఆయన్ను ఫోన్‌లో తీవ్ర పదజాలంతో దూషించారని కూడా కోటంరెడ్డి వివరించారు. ఈ పరిణామాలు పార్టీలో విజయసాయిరెడ్డి ప్రాధాన్యాన్ని తగ్గించేందుకు సజ్జల వర్గం ప్రయత్నించిందన్న వాదనలకు బలం చేకూరుస్తున్నాయి.

-మిగతా 2 లో



# స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

- బంగారాన్ని అనవసరంగా కొనకండి
- డెస్టినేషన్ పేరుతో విదేశాల్లో పెళ్లిళ్లకు దూరం కండి
- దేశప్రజల సమిష్టి కృషితోనే జిడిపి వృద్ధిరేటు
- దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించడం గర్వకారణం
- ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోడీ దేశ ప్రజలకు అభినందనలు

**న్యూఢిల్లీ,**
భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని భారత ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత దేశ జీడీపీ ఏకంగా 7.8 శాతం మేర వృద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని

-మిగతా 2 లో



02

## మా జీవనాధారాన్ని

# భారత్ ఆపేసింది..

- సింధు జలాల నిలిపివేతపై పాక్ ఆగ్రహం
- సింధు జలాల ఒప్పందంపై ముదురుతున్న వివాదం
- అంతర్జాతీయ వేదికలపై పాక్ గగ్గోలు
- నీటిని ఆయుధంగా వాడొద్దన్న షాబాజ్ షరీఫ్
- హేగ్ కోర్టు నిర్ణయాన్ని తిరస్కరించిన భారత్
- ఒప్పందాన్ని నిలిపివేసే నిర్ణయం కొనసాగుతుందన్న భారత్
- ఇరు దేశాల మధ్య మరింత పెరగనున్న దౌత్య ఉద్రిక్తతలు



02

# మహిళలకు త్వరలో 'ఏసీ' బస్సుల్లోనూ 'ఉచిత' ప్రయాణం

- మహిళలకు చంద్రబాబు గుడ్ న్యూస్...
- త్వరలో ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ప్రకటన
- సంక్షేమంతో పాటు అభివృద్ధే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం
- మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు వైసీపీ 350 కేసులు వేసిందని విమర్శ
- ఇప్పటివరకు పించన్ల రూపంలో రూ.73,000 కోట్లు అందించామని వెల్లడి


# హైడ్రా కమిషనర్‌కు హైకోర్టులో ఊరట

- రంగనాథ్‌ను తప్పించాలన్న గత ఆదేశాలపై స్టే
- 119 ఎకరాల ప్రభుత్వ భూముల వ్యవహారంలో కీలక పరిణామం
- డివిజన్ బెంచ్ ముందు హైడ్రా కమిషనర్ అప్పీల్
- రంగనాథ్ తరఫున సీనియర్ న్యాయవాది రాజీవ్ శక్దర్ వాదనలు
- తదుపరి విచారణ నవంబర్ 3కు వాయిదా
- ప్రభుత్వ భూముల పరిరక్షణపై కొనసాగుతున్న న్యాయపోరాటం

**సిటీబ్యూరో**
సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో జీఎల్ ఆర్ 243లో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన భూముల పరిరక్షణ విషయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో భారీ ఊరట లభించింది. గతంలో ఈ కేసు విచారణలో భాగంగా హైడ్రా కమిషనర్ ను తప్పించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ మంగళవారం నిలిపివేసింది. సింగిల్ జడ్జి ఇచ్చిన

-మిగతా 2 లో





02

## ఉక్రెయిన్‌పై రష్యా

# భీకర దాడి..

- డ్రోన్లు, మిస్సైళ్లతో విరుచుకుపడిన రష్యా
- 12 మంది మృతి.. మృతుల్లో ఒక భారతీయుడు
- కీవ్, ఒడెశాపై భారీగా దాడులు
- 200 వరకు డ్రోన్లు, మిస్సైళ్లతో విరుచుకుపడిన రష్యా
- 28 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్న దాడులు
- జనావాసాల్లో ధ్వంసమైన ఇళ్లు, అపార్ట్‌మెంట్లు
- క్షతగాత్రుల్లో చిన్నారులు కూడా
- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం
- ఉక్రెయిన్‌కు ఆర్థిక సాయం అందించేందుకు ఈయూ సిద్ధం

## నీట్ నిరసనల కేసులు

# కొట్టివేత


### విద్యార్థులు, యువతకు సుప్రీంకోర్టు భారీ ఊరట

- శాంతియుత నిరసనల్లో పాల్గొన్న వారిపై ఎఫ్ఐఆర్‌లు రద్దు
- ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు కీలక నిర్ణయం
- తీవ్ర నేరచరిత్ర ఉన్నవారిపై కేసులు కొనసాగింపు
- ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం
- మూడు నెలల్లోగా పరిహారం అందించాలని కేంద్రానికి ఆదేశం
- తీర్పును స్వాగతించిన నీట్ ఉద్యమ సంస్థలు
- సెప్టెంబర్ 5న తలపెట్టిన ఆందోళన విరమణ



**న్యూఢిల్లీ**
నీట్ యూజీ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థుల నిరసనలకు సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్‌లపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. శాంతియుతంగా నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులు, యువతపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేస్తూ వారికి చట్టపరమైన ఉపశమనం కల్పించింది. అయితే తీవ్ర నేరచరిత్ర ఉన్న వ్యక్తులు, నిరసనల

-మిగతా 2 లో



# ముంపు గ్రామంలో వెలిగొండ నీటి ఉధృతికి బొలెరో వాహనం గల్లంతు

02

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# మళ్లీ గ్యాస్ మంటలు

**- కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు పెంపు**
**- 19 కేజీల సిలిండర్‌పై రూ.9.50 పెరుగుదల**
**-- 14.2 కేజీల గృహ వినియోగ సిలిండర్ ధరలో మార్పు లేదు**
**- సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త ధరలు**



న్యూఢిల్లీ
నెల ప్రారంభంలోనే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు 19 కేజీల కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌పై రూ.9.50 చొప్పున ధర పెంచాయి. దీంతో రెస్టారెంట్లు, హోటళ్లు, దాబాలు, బేకరీలు, స్వీట్ షాపులు, ఇతర వాణిజ్య సంస్థలపై ఇంధన వ్యయం కొంత మేర పెరగనుంది.
కొత్త ధరల ప్రకారం.. ఢిల్లీలో 19 కేజీల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధర రూ.2,738 నుంచి రూ.2,747.50కి పెరిగింది. చెన్నైలో రూ.2,906గా ఉన్న ధర తాజాగా రూ.2,916.50కి చేరింది. ఇతర నగరాల్లో స్థానిక పన్నులు, ఇతర ఛార్జీల ఆధారంగా ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉండొచ్చని చెబుతున్నారు. కమర్షియల్ ఎల్పీజీ ధరలు పెరిగినప్పటికీ.. సాధారణ గృహ వినియోగదారులకు మాత్రం ఊరట లభించింది. 14.2 కేజీల డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండర్ ధరలో సెప్టెంబర్ 1 నుంచి ఎలాంటి మార్పు లేదు. తాజా ధర పెరుగుదల కేవలం వాణిజ్య సిలిండర్లకే వర్తిస్తుంది. దీంతో ఇంట్లో వంట కోసం గ్యాస్ ఉపయోగించే వినియోగదారులపై తక్షణం అదనపు భారం పడలేదు.
వ్యాపారాలపై ప్రభావం ఎంతంటే..
ఒక్కో సిలిండర్‌పై రూ.9.50 పెంపు పెద్ద మొత్తంగా కనిపించకపోయినా.. రోజుకు పలు సిలిండర్లు వాడే వ్యాపార సంస్థలకు నెలవారీగా అదనపు ఖర్చు పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రెస్టారెంట్లు, హోటళ్లు, దాబాలు, బేకరీలు, స్వీట్ షాపులు వంటి సంస్థలు కమర్షియల్ ఎల్పీజీపై ఎక్కువగా ఆధారపడతాయి. ఇంధన ఖర్చులు పెరిగితే భవిష్యత్తులో ఆహారం, ఇతర సేవల ధరలపై కూడా కొంత ప్రభావం పడే అవకాశం ఉంది. నిజానికి 2026లో వాణిజ్య ఎల్పీజీ ధరల్లో పలుమార్లు ధరల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఆగస్టులో కమర్షియల్ సిలిండర్ ధరలు గణనీయంగా తగ్గగా.. అంతకుముందు జులైలోనూ ధర తగ్గింపు నమోదైంది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్‌లో తాజాగా రూ.9.50 పెంపు జరిగింది. గత తగ్గింపులతో పోలిస్తే ఈసారి పెరుగుదల స్వల్పంగానే ఉన్నప్పటికీ.. వాణిజ్య వినియోగదారులపై అదనపు వ్యయభారం పడనుంది. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సాధారణంగా ప్రతి నెలా ఒకటో తేదీన ఎల్పీజీ ధరలను సమీక్షిస్తుంటాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడిసరుకు ధరలు, విదేశీ మార్పిడి విలువ, ఇతర వ్యయాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ధరల్లో మార్పులు చేస్తాయి. అందుకే సిలిండర్ బుక్ చేసుకునే ముందు తమ నగరానికి వర్తించే తాజా ధరను వినియోగదారులు, వ్యాపార సంస్థలు పరిశీలించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. మొత్తంగా సెప్టెంబర్ 1 నుంచి కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధరలు స్వల్పంగా పెరగ్గా.. గృహ వినియోగ ఎల్పీజీ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు లేకపోవడం సాధారణ వినియోగదారులకు ఊరటనిచ్చింది.

## మా జీవనాధారాన్ని భారత్ ఆపేసింది..

**-సింధు జలాల నిలిపివేతపై పాక్ ఆగ్రహం**
**-సింధు జలాల ఒప్పందంపై ముదురుతున్న వివాదం**
**-అంతర్జాతీయ వేదికలపై పాక్ గగ్గోలు**
**-నీటిని ఆయుధంగా వాడొద్దన్న షాబాజ్ షరీఫ్**
**-హేగ్ కోర్టు నిర్ణయాన్ని తిరస్కరించిన భారత్**
**-ఒప్పందాన్ని నిలిపివేసే నిర్ణయం కొనసాగుతుందన్న భారత్**
**-ఇరు దేశాల మధ్య మరింత పెరగనున్న దౌత్య ఉద్రిక్తతలు**



షాంఘై
భారత్--పాకిస్తాన్ మధ్య సింధు జలాల ఒప్పందంపై వివాదం మరింత ముదురుతోంది. సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడంపై పాకిస్తాన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఈ అంశాన్ని అంతర్జాతీయ వేదికలపై పదేపదే ప్రస్తావిస్తున్న పాకిస్తాన్.. తాజాగా షాంఘై సహకార సంస్థ సదస్సులోనూ లేవనెత్తింది. 2026-27 సంవత్సరానికి ఎస్ సి ఓ అధ్యక్ష పదవిని పాకిస్తాన్ చేపట్టిన నేపథ్యంలో బిష్కెక్ లో జరిగిన ఎస్ సి ఓ దేశాధినేతల మండలి శిఖరాగ్ర సమావేశంలో పాకిస్తాన్ ప్రధాని షాబాజ్ షరీఫ్ మాట్లాడారు. నీరు ఈ ప్రాంతానికి జీవనాధారమని పేర్కొంటూ, దానిని ఎప్పుడూ ఆయుధంగా, ఒత్తిడి సాధనంగా లేదా రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదని అన్నారు. ఉమ్మడి జల వనరులకు సంబంధించిన ఒప్పందాలు అంతర్జాతీయంగా కట్టుబడి ఉండే బాధ్యతలని షాబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. అలాంటి ఒప్పందాలను ఎలాంటి షరతులు లేకుండా తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందని అన్నారు. అయితే, పాకిస్తాన్ ఎదుర్కొంటున్న ఉగ్రవాద సమస్య, దానిపై తీసుకోవాల్సిన చర్యల గురించి ఆయన తన ప్రసంగంలో ప్రస్తావించలేదు.
హేగ్ కోర్టు తీర్పు.. భారత్ తిరస్కరణసింధు జలాల ఒప్పందంపై ఆగస్టు 31న హేగ్ లోని కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ కీలక నిర్ణయం వెలువరించింది. 1960లో కుదిరిన సింధు జలాల ఒప్పందం అమల్లోనే ఉందని, భారత్ దాని బాధ్యతలను కొనసాగించాలని కోర్టు పేర్కొంది. అలాగే జమ్మూకాశ్మీర్ లోని రాట్లే జలవిద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించి కొన్ని నిర్మాణ పనులను పరిమితం చేయాలని మధ్యంతర ఆదేశాలు ఇచ్చింది. అయితే ఈ తీర్పును భారత్ తీవ్రంగా తిరస్కరించింది. హేగ్ లోని ఈ కోర్టును తాము గుర్తించలేదని, అది చట్టవిరుద్ధంగా ఏర్పాటు చేయబడిందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. భారత సార్వభౌమ నిర్ణయాలపై తీర్పు ఇచ్చే అధికారం ఆ కోర్టుకు లేదని పేర్కొంది. సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయం యథాతథంగా కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో పాకిస్తాన్ అంతర్జాతీయ వేదికలపై సింధు జలాల అంశాన్ని మరింత బలంగా ప్రస్తావిస్తోంది. మరోవైపు, భారత్ మాత్రం హేగ్ కోర్టు ఆదేశాలను అంగీకరించేది లేదని తేల్చి చెప్పింది. దీంతో సింధు జలాల ఒప్పందంపై ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.

## ముంపు గ్రామంలో వెలిగొండ నీటి ఉధృతికి బొలెరో వాహనం గల్లంతు

-చెట్టెక్కి ప్రాణాలు కాపాడుకున్న యువకులు
-రాత్రంతా చెట్టుపైనే ముగ్గురు యువకులు!
-సమాచారం అందుకుని ఘటనా స్థలానికి వెళ్లి యువకులను కాపాడిన జిల్లా కలెక్టర్ విజయసునీత , ఎమ్మెల్యే కందుల, జాయింట్ కలెక్టర్
-పెద్దారవీడు మండలం కలనూతల ముంపు గ్రామంలో ఘటన



మార్కాపురం, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
వెలిగొండ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో నూతన మార్కాపురం జిల్లా లోని ముంపు గ్రామాల్లో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఈ తరుణం పెద్దారవీడు మండలం కలనూతల ముంపు గ్రామంలోకి భారీగా నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో నీటి ప్రవాహాన్ని దాటేందుకు ప్రయత్నించిన బొలెరో వాహనం కొట్టుకు పోవడంతో అందులో ఉన్న యువకులు ప్రమాదంలో చిక్కుకున్నారు. దీంతో సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత, ఎమ్మెల్యే కందుల,జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు సకాలంలో స్పందించి రెస్క్యూ సిబ్బంది వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. పూర్తి వివరాలల్లోకి వెళ్తే.. మార్కాపురం మండలం కలనూతల గ్రామాన్ని నిర్వాసితులు ఖాళీ చేస్తున్న సమయంలో ఒక్కసారిగా పెద్ద ఎత్తున నీరు వచ్చి చేరింది. దీంతో గ్రామం చుట్టూ నీటి ప్రవాహం పెరిగింది. ఇదే సమయంలో రోడ్డు దాటేందుకు ప్రయత్నించిన బొలెరో వాహనం అదుపుతప్పి వరద నీటిలో కొట్టుకుపోయింది. వాహనంలోని ముగ్గురు యువకులు వెంటనే బయటకు వచ్చి సమీపంలోని చెట్టును పట్టుకున్నారు. అయితే నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో అక్కడి నుంచి బయటకు రావడం సాధ్యం కాలేదు. దీంతో రాత్రంతా చెట్టుపైనే ఉండి తమను కాపాడాలంటూ సహాయం కోసం కేకలు వేశారు.
రంగంలోకి దిగిన కలెక్టర్, ఎమ్మెల్యేల
సమాచారం అందుకున్న మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ విజయ సునీత, జాయింట్ కలెక్టర్ , డీఎస్పీ యు. నాగరాజు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. పోలీసులతో పాటు అగ్నిమాపక, రెస్క్యూ సిబ్బంది కూడా అక్కడికి చేరుకున్నారు. అయితే నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో వెంటనే సహాయక చర్యలు చేపట్టడం కష్టంగా మారింది. కొల్లం వాగు, ఫీడర్ గేట్లను మూసివేసి నీటి ప్రవాహాన్ని కొంతమేర తగ్గించిన అనంతరం రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. చివరకు చెట్టుపై చిక్కుకున్న ముగ్గురు యువకులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.
ఇదిలా ఉండగా, వెలిగొండ ప్రాజెక్టు నుంచి నల్లమల సాగర్ జలాశయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారికంగా నీటిని విడుదల చేసిన నేపథ్యంలో 5భారీగా నీరు చేరుతోంది. ముంపు గ్రామాలను ముందుగానే ఖాళీ చేయించడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. తాజా ఘటనతో ముంపు ప్రాంతాల్లో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

# కన్నీటిలో నేపాల్..

**-- వెయ్యి దాటిన మృతుల సంఖ్య**
**-- గల్లంతైన వారు 4వేలకు పైమాటే..**
**-- వేలాది మంది ఆచూకీ కోసం ఎదురుచూపులు**
**-- శిథిలాల కిందే వేలాది ప్రాణాలు..**
**-- కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్**




**ఖాట్మండు:**
నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరద తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ జలప్రళయంలో మృతుల సంఖ్య 987కు చేరింది. చైనాలో మరో 16 మంది మరణించినట్లు సమాచారం. రెండు దేశాల్లో కలిపి మృతుల సంఖ్య 1,000 దాటింది. 4 వేలకు పైగా మంది ఇంకా కనిపించడం లేదని అధికారులు వెల్లడించారు. విపత్తు సంభవించి ఏడో రోజుకు చేరుకున్నప్పటికీ సహాయక, గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. తాత్కాలిక వంతెనలను నిర్మిస్తూ బాధిత్ ప్రాంతాలకు చేరుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటివరకు 11,000 మందికి పైగా ప్రజలను రక్షించినట్లు సమాచారం. నేపాల్, భారత్, చైనా బృందాలకు చెందిన వేలాది మంది సిబ్బంది హెలికాప్టర్లు, డ్రోన్లు, భారీ యంత్రాలను ఉపయోగిస్తూ సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. వరదల్లో తీవ్రంగా దెబ్బతిన్న హైడ్రోపవర్ ప్రాజెక్టులు ప్రస్తుతం రెస్క్యూ చర్యలకు ప్రధాన కేంద్రాలుగా మారాయి.
దాదాపు 900 మంది హైడ్రోపవర్ కార్మికులు గల్లంతయ్యారని, వారిలో సుమారు 500 మంది సొరంగాల్లో చిక్కుకుని ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. సొరంగాల్లోకి మట్టి, రాళ్లు, నీరు భారీగా చేరడంతో లోపలికి వెళ్లి గాలింపు చేపట్టడం అత్యంత ప్రమాదకరంగా మారింది. డ్రోన్లను ఉపయోగించి బాధితులను గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే సొరంగాలు మలుపులు, మట్టి, శిథిలాలతో నిండిపోవడంతో డ్రోన్లను లోపలికి పంపడం కూడా సాధ్యపడటం లేదు. కొందరు కార్మికులతో తొలుత సంబంధాలు ఏర్పడినప్పటికీ, ఆ తర్వాత వారి పరిస్థితిపై స్పష్టమైన సమాచారం లభించలేదని నివేదికలు చెబుతున్నాయి.
భారత సైన్యానికి చెందిన సాంకేతిక బృందాలు నేపాల్ సైన్యంతో కలిసి చిలామే, లాంగ్‌టాంగ్ ప్రాంతాల్లోని సొరంగాల్లో గాలింపు చేపట్టాయి. హిమాలయ ప్రాంతంలో వాతావరణ మార్పుల ప్రభావాన్ని అంతర్జాతీయ సమాజం తీవ్రంగా పరిగణించాల్సిన అవసరాన్ని నేపాల్ ప్రధానమంత్రి బాలేంద్ర షా ప్రస్తావించారు. గల్లంతైన వారిలో విదేశీయులు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు. నేపాల్ అధికారుల లెక్కల ప్రకారం గల్లంతైన వారిలో 583 మంది విదేశీయులు ఉన్నారు. తమ కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం విదేశీ పౌరుల బంధువులు నేపాల్ అధికారులను సంప్రదిస్తున్నారు. మృతదేహాలను గుర్తించేందుకు డీఎన్ఏ నమూనాలు, ఫోటోలు వంటి వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. వరదల్లో గల్లంతైన ఓ అమెరికా పౌరుడిని అధికారులు తాజాగా సంప్రదించగలిగారు. వరదల ప్రభావం నేపాల్ హైడ్రోపవర్ రంగాన్ని తీవ్రంగా పడింది. పలు విద్యుత్ కేంద్రాలు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు దెబ్బతినడంతో దేశ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో గణనీయమైన భాగం ప్రభావితమైంది. కొన్ని విద్యుత్ ఎగుమతులను నిలిపివేసి భారత్ నుండి విద్యుత్ దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## విజయసాయిరెడ్డిపై సజ్జల దాడి నిజమే.. చౌక్కా పట్టుకుని కొట్టారు..

మొదటి తరువాయి

2023లో వైసీపీని వీడిన కోటంరెడ్డి...
2019లో వైసీపీ తరఫున నెల్లూరు రూరల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, పార్టీ నాయకత్వంతో విభేదించి 2023లో వైసీపీని వీడారు. అనంతరం టీడీపీలో చేరి, 2024 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. వైసీపీలో అంతర్గతంగా జరిగిన విషయాలు తెలిసిన వ్యక్తిగా ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. విజయసాయిరెడ్డి లేఖతో మొదలైన ఈ వివాదం, కోటంరెడ్డి ధ్రువీకరణతో మరింత ముదిరి, వైసీపీ నాయకత్వాన్ని ఇరుకున పెట్టేలా మారింది.



## హైడ్రా కమిషనర్‌కు హైకోర్టులో ఊరట

మొదటి తరువాయి
తీర్పుపై హైడ్రా కమిషనర్ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసిన విషయం విదితమే. ఈ కేసు మంగళవారం విచారణకు వచ్చింది. హైడ్రా కమిషనర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ రాజీవ్ శక్దర్ సుదీర్ఘ వాదనలు వినిపించారు. అనంతరం డివిజన్ బెంచ్ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సస్పెండ్ చేసింది. తదుపరి విచారణను నవంబరు 3కు వాయిదా వేసింది.
కేసు పూర్వాపరాలు..
సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని జీఎల్ ఆర్ 243లో 119 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. బీ-2 భూములుగా పేర్కొన్న వీటిని ఆస్పత్రులు, పాఠశాలలు.. ఇలా రాష్ట్ర ప్రభుత్వ అవసరాల నిమిత్తం సికింద్రాబాద్ కంటోన్మెంట్ కేటాయించింది. వీటి హక్కుదారుగా రాష్ట్ర ప్రభుత్వం ఉండటమే కాకుండా, వాటి సంరక్షణ బాధ్యతలు కూడా తీసుకుంటుంది. జులై 18న తిరుమలగిరి -- అల్వాల్ ప్రాంతంలోని ఈ 119 ఎకరాల ప్రభుత్వ భూమికి హైడ్రా ఫెన్సింగ్ వేసింది. ఇది ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ డిఫెన్స్ ఎస్టేట్ అధికారులు కూడా ధ్రువీకరించారు. ఇందుకు సంబంధించిన కో ఆర్డినేట్స్, గూగుల్ ఎర్త్‌మీద క్లియర్‌గా మార్కు చేస్తూ కేఎంఎల్ ఫైల్ ఇచ్చారు.
3 కిలోమీటర్ల దూరం..
మేడ్చల్ -- మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలం లోతుకుంట సర్వే నంబరు 1, 2లో ఉన్న ప్రయివేటు భూములకు, 243 జీ ఎల్ ఆర్ నెంబరులో ఉన్న 119 ఎకరాల ప్రభుత్వ భూమికి మధ్య దూరం 3 కిలోమీటర్ల వరకూ ఉందని హైడ్రా చెబుతూ వస్తోంది. లోతుకుంట సర్వే నంబరు 1, 2 లో అనుమతులు తెచ్చుకుని జీఎల్ ఆర్ నెంబర్ 243లోని ప్రభుత్వ భూమిలో శాంతశ్రీరాం కనస్ట్రక్షన్స్ నిర్మాణాలు చేపడుతోంది. ప్రభుత్వ భూమిని తమదిగా చెబుతూ హైకోర్టును ఆశ్రయించడమే కాకుండా కంటెంప్ట్ కేసు కూడా హైడ్రాపై వేసింది. వ్యక్తిగతంగా హైడ్రా కమిషనర్‌పై కూడా కంటెంప్ట్ కేసు వేసింది. ఈ కేసు విచారణలో హైకోర్టు సింగిల్ జడ్జి పలు వ్యాఖ్యలు చేయడమే కాకుండా.. హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి ఏవీ రంగనాథ్ ను తప్పించి, ఆ స్థానంలో మరొకరిని నిమించాలంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఈ ఆదేశాలను హైకోర్టు డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది.

## మహిళలకు త్వరలో 'ఏసీ' బస్సుల్లోనూ 'ఉచిత' ప్రయాణం

**-మహిళలకు చంద్రబాబు గుడ్ న్యూస్...**
**-త్వరలో ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ప్రకటన**
**-సంక్షేమంతో పాటు అభివృద్ధే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం**
**-మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు వైసీపీ 350 కేసులు వేసిందని విమర్శ**
**-ఇప్పటివరకు పింఛన్ల రూపంలో రూ.73,000 కోట్లు అందించామని వెల్లడి**




**అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :**
ఆంధ్రప్రదేశ్ మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీపి కబురు అందించారు. రాష్ట్రంలో త్వరలో పెద్ద ఎత్తున అందుబాటు లోకి రానున్న ఏసీ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. మొగల్తూరులో నిర్వహించిన 'ఎన్టీఆర్ భరోసా' సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ముఖ్యమంత్రి ఈ కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి పథంలో పయనిస్తోందని పేర్కొన్నారు. సంక్షేమంతో కూడిన అభివృద్ధే తమ ప్రభుత్వ విధానమని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు పింఛన్ల రూపంలోనే ప్రజలకు రూ. 73,000 కోట్లు అందించినట్లు గుర్తు చేశారు. మహిళలు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, వారి కష్టాలను తీర్చేందుకే 'దీపం' పథకాన్ని తీసుకువచ్చామని వివరించారు.
గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర
ఇదే సమయంలో గత వైసీపీ ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మెగా డీఎస్సీని అడ్డుకోవాలనే లక్ష్యంతో ఏకంగా 350 కేసులు వేశారని ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్రంలో అభివృద్ధిని ఆపలేరని హితవు పలికారు. కేవలం ప్రజల ప్రయోజనాల కోసమే కూటమి పార్టీలు ఏకమయ్యాయని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రభుత్వం బాధ్యతాయుతంగా ముందుకు సాగుతోందని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

## నీట్ నిరసనల కేసులు కొట్టివేత

మొదటి తరువాయి
సమయంలో తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారిపై విచారణ మాత్రం కొనసాగాలని స్పష్టం చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యాబాగ్చీ, జస్టిస్ వి మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద ఉన్న ప్రత్యేక అధికారాలను వినియోగించిన సుప్రీంకోర్టు.. విద్యార్థుల భవిష్యత్తును ఒక్క ఎఫ్ఐఆర్ ఆధారంగా దెబ్బతీయకూడదని అభిప్రాయపడింది. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసన వ్యక్తీకరణ హక్కు ఒక రాజ్యాంగబద్ధమైన హక్కు అని, నిరసనల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ నేరస్థులుగా చూడడం సరైన విధానం కాదని కోర్టు పేర్కొంది. అయితే ఈ ఉపశమనం అందరికీ వర్తించదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇప్పటికే హత్య, అత్యాచారం, హింసాత్మక దాడులు, ఆస్తుల ధ్వంసం వంటి తీవ్రమైన కేసుల్లో నేరచరిత్ర ఉన్నవారు, నిరసనల సందర్భంగా అలాంటి నేరాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం విచారణ కొనసాగాలని ఆదేశించింది. అలాంటి వ్యక్తులపై ప్రత్యేక ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టేందుకు అనుమతి ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టులో విద్యార్థులపై నమోదైన కేసులను కొనసాగించే ఉద్దేశం లేదని తెలిపింది. అయితే తీవ్రమైన నేరచరిత్ర ఉన్నవారిపై మినహాయింపు ఉండాలని కోరగా, సుప్రీంకోర్టు కూడా అదే దిశగా నిర్ణయం తీసుకుంది. ఈ తీర్పు విద్యార్థులకు లభించిన ముఖ్యమైన న్యాయ విజయమని నీట్ ఉద్యమానికి మద్దతు తెలిపిన సంస్థలు పేర్కొన్నాయి.

## ఉక్రెయిన్‌పై డ్రోన్లు, మిస్సైళ్లతో రష్యా దాడులు..

**12 మంది మృతి.. మృతుల్లో ఒక భారతీయుడు**



రష్యా-ఉక్రెయిన్ మధ్య భీకర యుద్ధం కొనసాగుతోంది. ఇరు దేశాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. తాజాగా ఉక్రెయిన్‌పై రష్యా భారీ దాడికి దిగింది. రాజధాని కీవ్‌తోపాటు ఒడెశాపై డ్రోన్లు, మిస్సైళ్లతో విరుచుకుపడింది. ఈ ఘటనలో 12 మంది మరణించినట్లు సమాచారం. మృతుల్లో ఒక భారతీయుడు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అతడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. తాజా దాడులపై ఉక్రెయిన్ ప్రకటన చేసింది. దీని ప్రకారం.. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు ఉక్రెయిన్‌లోని 28 స్థావరాలపై రష్యా దాడి చేసింది. 200 వరకు డ్రోన్లు, మిస్సైళ్లతో దాడి చేసింది. కీవ్‌తోపాటు ఒడెశా ప్రాంతంపై బాలిస్టిక్ మిస్సైల్స్, క్రూయిజ్ మిస్సైల్స్, యాంటీ రాడార్ మిస్సైళ్లతో దాడికి పాల్పడింది. ఈ దాడుల కారణంగా ఉక్రెయిన్‌లో 12 మంది మరణించారు. మరికొందరు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో పిల్లలు కూడా ఉన్నారు. జనావాసాలపై ఈ దాడులు జరిగాయి. అనేక ఇండ్లు, అపార్ట్‌మెంట్లు ధ్వంసమయ్యాయి.

## స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

(మొదటి తరువాయి)
మోదీ దేశ ప్రజలకు అభినందనలు చెప్పారు. 7.8 శాతం వృద్ధి రేటు నమోదవడంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోందని అన్నారు. దేశ ప్రజల పట్టుదల, శక్తిసామర్థ్యాలు గొప్పవని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నా భారత్ వృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. భారత దేశ ప్రగతిని ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని చెప్పారు. ఆత్మనిర్భరత సాధించడం అవసరమని మరోసారి చెప్పారు. స్వదేశీ వస్తువులకు దేశ ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు వద్దని అన్నారు. విదేశీ మారకనిల్వల పొదుపు కోసం భారత్‌లోనే వివాహాది శుభకార్యాలు జరుపుకోవాలని సూచరించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు అభినందనలు తెలిపిన ఆయన.. గతంలో చేసిన విజ్ఞప్తినే మరోసారి గుర్తుచేశారు. స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని, విదేశీ ప్రయాణాలు వద్దని, అవసరం లేకుండా బంగారం కొనొద్దని మరోసారి కోరారు. ప్రస్తుతం కిర్గిస్థాన్ పర్యటనలో ఉన్న ఆయన ఈ మేరకు ఇన్‌స్టా వీడియో విడుదల చేశారు. దేశ ప్రజలకు అభినందనలు. 7.8? వృద్ధి గొప్ప విషయం. ప్రజల సంకల్ప బలం, కృషికి ఇది నిదర్శనం. ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ ఈ అసాధారణ ఘనతను దక్కించుకుంది. ప్రపంచం యుద్ధంలో మునిగిపోయింది. ఎటుచూసినా యుద్ధ వార్తలే.. సంక్షోభాలే. సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతింది. 2020లో కొవిడ్ తర్వాత నుంచి నేటి వరకు ఎక్కడా స్థిరత్వం కనిపించడం లేదు. అయినా భారత్ పురోగమిస్తోందని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు. పర్యటనల కోసం విదేశాలకు వెళ్లొద్దు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు దూరంగా ఉండండి. 'భారత్‌లోనే వివాహం చేసుకోండి' అనే మంత్రాన్నే మనం పాటిద్దాం. అవసరం లేకపోతే బంగారాన్ని కొనడం మానుకోండి. స్థానికంగా తయారైన వస్తువులు, సేవలు ఎంత ఎక్కువగా ఎంచుకుంటే.. దేశం అంత ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# జీవితానికి భరోసా సిఎంఆర్ఎఫ్

**- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**
**-నిమ్స్‌లో చికిత్సకు షాద్‌నగర్ వాసికి సీఎం సహాయ నిధి రూ.3 లక్షల ఎల్ఓసీ**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 01 (జర్నలిస్ట్ డైరీ) :** అనారోగ్యంతో చికిత్స పొందుతున్న షాద్‌నగర్‌కు చెందిన మెరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) ద్వారా రూ.3 లక్షల ఆర్థిక సహాయం మంజూరైంది. ఇందుకు సంబంధించిన లోకల్ ఆర్డర్ కాపీని ముఖ్యమంత్రి కార్యాలయం నిమ్స్ ఆసుపత్రి డైరెక్టర్‌కు పంపింది. షాద్‌నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఈ నెల 22న ముఖ్యమంత్రి కార్యాలయానికి చేసిన విజ్ఞప్తి మేరకు ఈ సహాయం మంజూరైనట్లు లేఖలో పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని నెహ్రూనగర్ కాలనీకి చెందిన మెరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి కుమారుడిగా లేఖలో పేర్కొన్నారు. జీవితానికి ముప్పు కలిగించే ఇతర అనారోగ్య పరిస్థితికి చికిత్స పొందేందుకు రూ.3,00,000 వరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు చేయనున్నట్లు సీఎం కార్యాలయం వెల్లడించింది. హైదరాబాద్ పంజాగుట్టలోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో అవసరమైన చికిత్స అందించాలని ఆసుపత్రి డైరెక్టర్‌ను ఆదేశించింది. చికిత్స పూర్తయిన అనంతరం సంబంధిత బిల్లును సమర్పించాలని సీఎం కార్యాలయం సూచించింది. ఈ మేరకు ఆగస్టు 25, 2026న ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అధికారికంగా లేఖ జారీ అయింది. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న శ్రీనివాస్‌రెడ్డికి సీఎం సహాయ నిధి ద్వారా రూ.3 లక్షల సాయం అందేలా ఎమ్మెల్యే శంకరయ్య చొరవ తీసుకోవడంపై కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, పార్టీ అధ్యక్షుడు శ్రీధర్, సీనియర్ నేత చెంది తిరుపతిరెడ్డి, ముబారక్ అలీ ఖాన్ తదితరులు ఉన్నారు.

# ఏఐకేఎంఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**- జిల్లా కార్యదర్శి బి. మల్లేశ్**




**జర్నలిస్ట్ డైరీ పరిగి, సెప్టెంబర్ 01:** మంచిర్యాల జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) తెలంగాణ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం పరిగిలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బి. మల్లేశ్ మాట్లాడుతూ, పాలకవర్గాల రైతు వ్యతిరేక విధానాలు, సరళీకరణ ఆర్థిక విధానాల కారణంగా దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ రైతాంగ పోరాట సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. విదేశాలతో, ముఖ్యంగా అమెరికాతో కుదుర్చుకున్న అసమాన ఒప్పందాల వల్ల రైతులకు గిట్టుబాటు ధర దక్కకుండా పోతోందని, వెంటనే ఆ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బహుళజాతి కంపెనీల నకిలీ, అనుమతిలేని విత్తన వ్యాపారాలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని మండిపడ్డారు. ఈ సమస్యలపై రాబోయే మహాసభల్లో చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని స్పష్టం చేశారు. కావున జిల్లా నలుమూలల నుంచి రైతులు, కూలీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ సభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు జె. శివకుమార్, ఎం. యాదయ్య, కె. అంజయ్య, పి. మాణిక్యం, బి. నర్సింలు, టి. మల్లేష్, ప్రకాష్, నరేందర్, మహేందర్, శ్రీశైలం, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# వేముల్ నార్వ,చౌదరి గూడలో హైమాస్ట్ లైట్స్ ప్రారంభోత్సవం

**-ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**
**-ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సొంత నిధులతో ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 01 (జర్నలిస్ట్ డైరీ) :** కేశంపేట మండలం వేముల్ నార్వ మరియు చౌదరి గూడలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన రెండు హైమాస్ట్ లైట్లను నిన్న రాత్రి సోమవారం గ్రామస్తుల సమక్షంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ప్రారంభించారు.ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన సొంత నిధులతో తమ గ్రామాలలో అభివృద్ధి పనులలో భాగంగా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప విషయమని గ్రామస్తులు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియస్తూ రానున్న కాలంలో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి తమ గ్రామాలను మరింత అభివృద్ధి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రఘునాథ్ యాదవ్,వేమూల్ నార్వ సర్పంచ్ పల్లెమోని సువర్ణ నర్సిములు,కేశంపేట సర్పంచ్ బుజ్జం సంతోష శ్రీశైలం యాదవ్,పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,ఇప్పలపల్లి సర్పంచ్ మంజుల జంగయ్య,లింగందాన సర్పంచ్ నాగిల్ల వెంకటేష్,కమ్మదనం సర్పంచ్ లతాకిరణ్ గౌడ్,తూర్పుగడ్డ తండా థౌర్య నాయక్,భైర్కాన్ పల్లి సర్పంచ్ తనయుడు శివ యాదవ్,మాజీ సర్పంచులు,తాంద్ర విష్ణువర్ధన్ రెడ్డి,శేఖర్ పంతులు,యారం శేఖర్ రెడ్డి,ఆంజనేయులు యాదవ్,ప్రభాకర్ రెడ్డి,మీనమోనిపల్లి సత్య నారాయణ, క్రిష్ణయ్య, మాజీ ఎంపిటిసి కోటేశ్వర్,ఉపసర్పంచులు యారం రామ్ రెడ్డి,సహదేవ్, మాజీ ఉపసర్పంచ్లు సుదర్శన్ గుప్త,నాయకులు వేములనర్వ మల్లేష్,తుకారాం, మురళి,జగన్ రెడ్డి,క్రిష్ణ,సత్య నారాయణ, సాయిరాం,అబిశ్రీను,వేమూల్ నార్వ, చౌదరిగూడ గ్రామస్థులు మరియు మండల బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శిరీష హత్యపై పారదర్శక విచారణ జరిపి నిందితులకు కఠిన శిక్ష విధించాలి

**ఎస్ఎఫ్ఐ షాద్‌నగర్ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్ డిమాండ్**
**షాద్‌నగర్ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 01 (జర్నలిస్ట్ డైరీ) :** హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో 21 ఏళ్ల ఆదివాసీ యువతి వి.కె. శిరీష దారుణ అత్యాచారం, హత్యకు గురైన ఘటనపై ఎస్ఎఫ్ఐ షాద్‌నగర్ డివిజన్ కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి, ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉన్నత చదువులు చదువుకుంటూ కుటుంబానికి ఆసరాగా నిలవాలనే ఆశయంతో నగరానికి వచ్చిన గిరిజన యువతికి ఇలాంటి దారుణం జరగడం అత్యంత బాధాకరమని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్ అన్నారు.
ఈ కేసులో పోలీసులు ఒకరిని అరెస్ట్ చేసినట్లు ప్రకటించినప్పటికీ, దర్యాప్తు పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగాలని ఆయన డిమాండ్ చేశారు. ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యంపై కూడా సమగ్ర విచారణ జరపాలని, ఈ ఘటనలో మరెవరైనా ప్రమేయం ఉందా అనే కోణంలో అన్ని అంశాలను పరిశీలించాలని కోరారు.




శిరీష హత్య కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా తక్షణమే విచారించి నిందితులకు కఠిన శిక్ష విధించాలని, ఉద్యోగినికి రక్షణ కల్పించడంలో విఫలమైన ఆసుపత్రి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం వెంటనే భారీ ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు. అలాగే నగరాలకు ఉపాధి, విద్య కోసం వచ్చే శ్రామిక మహిళలు, నర్సులు, విద్యార్థినుల భద్రతకు కార్యాలయాలు, విద్యాసంస్థలు, హాస్టళ్లలో ప్రత్యేక రక్షణ చర్యలు, సమర్థవంతమైన భద్రతా వ్యవస్థలు అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది.
ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ ఉపాధ్యక్షులు అదిల్, చరణ్, వంశీ, రామ్‌చరణ్, విష్ణువర్ధన్, నబీతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# పార్టీ జెండా మళ్లీ ఎగరేయడమే లక్ష్యం

**-షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్**
**-అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యం**
**-డీసీసీ అధ్యక్షుడి ఎన్నికపై కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల భేటీ**
**-నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు సేకరించిన ఏఐసీసీ అబ్జర్వర్**
**-సమావేశానికి హాజరైన ఏఐసీసీ అబ్జర్వర్, కర్ణాటక ఎమ్మెల్సీ పి.వి. మోహన్**




రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక నేపథ్యంలో షాద్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐసీసీ అబ్జర్వర్, కర్ణాటక ఎమ్మెల్సీ పి.వి. మోహన్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తల అభిప్రాయాలను సేకరించారు.సమావేశంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్, డీసీసీ మాజీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, అబ్జర్వర్ శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భారత్, కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ పీ. రఘు నాయక్ తదితరులు పాల్గొన్నారు.అలాగే మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీలు, వివిధ విభాగాల నాయకులు, పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.డీసీసీ అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించి పార్టీ బలోపేతం, జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన అంశాలపై నాయకులు తమ అభిప్రాయాలను అబ్జర్వర్లకు వివరించారు. కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎంపిక చేయాలని వారు కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పార్టీ బలోపేతమే ప్రతి కార్యకర్త ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే అన్ని ఎన్నికల్లో షాద్‌నగర్ నియోజకవర్గంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని అన్నారు.డీసీసీ అధ్యక్షుడి ఎంపిక విషయంలో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే శిరోధార్యమని, పార్టీ ప్రయోజనాలు, భవిష్యత్ బలోపేతాన్ని దృష్టిలో ఉంచుకుని అధిష్ఠానం నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు..

# మూడు రోజుల్లో 'తల్లికి వందనం' నిధులు

**-విద్యార్థులకు గుడ్ న్యూస్.. చెప్పిన ఏపీ ప్రభుత్వం**
**-ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆర్థిక సాయం సాంకేతిక కారణాలతో ఆలస్యమైనట్లు వెల్లడి**
**-గతంలో అందని అర్హులకు కూడా ఈసారి జమ**
**-సుమారు 2.80 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి**

**అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** ఆంధ్రప్రదేశ్‌లో 'తల్లికి వందనం' పథకం కింద డబ్బులు పడకుండా ఎదురుచూస్తున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. మరో మూడు రోజుల్లో అర్హులైన మిగిలిన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఈ నిధులను జమ చేయనున్నట్లు వెల్లడించింది. ముఖ్యంగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఈ పథకం కింద ఆర్థిక సహాయం అందనుంది.వాస్తవానికి ఈ నిధులను ఆగస్టు 30వ తేదీనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా, కొన్ని సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడింది. ఈ నేపథ్యంలో అధికారులు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పునఃసమీక్షించారు. ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాల నుంచి అర్హులైన లబ్ధిదారుల జాబితాలను స్వీకరిస్తున్నారు. ఈ జాబితాల పరిశీలన పూర్తయిన వెంటనే ఆర్థిక శాఖ నేరుగా ఖాతాల్లోకి నగదును జమ చేయనుంది.

**ప్రయోజనం పొందనున్న 2.80 లక్షల మంది విద్యార్థులు..**


ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.80 లక్షల మంది విద్యార్థులు ప్రయోజనం పొందనున్నారు. గతంలో అర్హత ఉండి కూడా వివిధ కారణాలతో నిధులు అందని వారికి సైతం ఈ దఫాలోనే నగదు జమ చేయనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# ‘వెలిగొండ’ ప్రాజెక్టు కాలువలో నీళ్లు తాగుతున్న ‘వానరాలు’..

-వీడియో పోస్ట్ చేసిన సీఎం చంద్రబాబు
-వెలిగొండ కాలువలో కోతుల వీడియో షేర్ చేసిన చంద్రబాబు
-“జలం.. జీవం.. జీవితం” అంటూ పోస్టుకు క్యాప్షన్
-మొన్ననే మార్కాపురంలో ప్రాజెక్టు తొలిదశ ప్రారంభం
-దశాబ్దాల నాటి కరవు ప్రాంత దాహార్తిని తీరుస్తున్న ప్రాజెక్టు
-మూగజీవాల దాహం కూడా తీరుతోందని సీఎం సంతోషం

**అమరావతి, ఏపీ బ్యూరో, కోస్తా లీడర్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన వీడియోను పంచుకున్నారు. మొన్న ప్రారంభమైన వెలిగొండ



ప్రాజెక్టు ఫీడర్ కాలువలో కొన్ని కోతులు గుంపుగా వచ్చి నీళ్లు తాగుతూ తమ దాహాన్ని తీర్చుకుంటున్న దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి. “జలం.. జీవం.. జీవితం” అంటూ ఆయన ఈ వీడియోకు క్యాప్షన్ జోడించారు. ఈ పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. మార్కాపురం జిల్లాలో దశాబ్దాల నాటి కలను సాకారం చేస్తూ సోమవారం పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు తొలి దశను ముఖ్యమంత్రి చంద్రబాబు జాతికి అంకితం చేసిన విషయం తెలిసిందే. ఫీడర్ కెనాల్ నుంచి కృష్ణా జలాలను నల్లమల సాగర్‌లోకి విడుదల చేసి, ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ చారిత్రక ఘట్టంతో స్థానిక ప్రజలు భావోద్వేగానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో, ప్రాజెక్టు ఫలాలు కేవలం మనుషులకే కాకుండా, ఆ ప్రాంతంలోని మూగజీవాలకు కూడా




అందుతున్నాయనడానికి ఈ వీడియో నిదర్శనంగా నిలుస్తోంది. కరవు పీడిత ప్రాంతానికి సాగు, తాగునీరు అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చేపట్టారు. పిల్ల కోతులతో సహా వచ్చి వానరాలు స్వేచ్ఛగా నీరు తాగుతుండటంపై సీఎం తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. మానవులతో పాటు జీవరాశుల దాహార్తిని కూడా ఈ ప్రాజెక్టు తీరుస్తోందన్న భావనను ఆయన తన పోస్ట్ ద్వారా తెలియజేశారు


# సిద్దాపూర్ డంపింగ్ యార్డు పిర్యాదుతో కదిలిన జాతీయ ఎస్టీ కమిషన్

**- 15 రోజుల్లో వివరణ ఇవ్వాలి అని పాల్యూషన్ కంట్రోల్ బోర్డు కు మరియు జిల్లా కలెక్టర్ కు నోటీసులు.**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 01 (జర్నలిస్ట్ డైరీ) :**
రంగారెడ్డి జిల్లా, కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఏకో పార్క్ పేరు మీద డంపింగ్ యార్డు కొరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కు 86 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ ఈ సంవత్సరం జూలై 2 వ తేదినాడు జీవో 641 నీ తీసుకురావడం జరిగింది . దీనిని వ్యతిరేకిస్తూ సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక జాయింట్ యాక్షన్ కమిటీ (SDVP JAC) ఏర్పాటు జరిగి ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.. ఇందులో భాగంగా జేఏసీ చైర్మన్ మూడావత్ రాంబాల్ నాయక్ ఆధ్వర్యంలో ఎస్టీ సర్పంచులు నాయకులు కలసి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జటావత్ హుస్సేన్ నాయక్ ను కలసి పిర్యాదు చేశారు... ఈ పిర్యాదుపై స్పందించిన ఎస్టీ కమిషన్ ఆగస్టు 31 తేదీతో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సెక్రటరీ కి మరియు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు నోటీసులు జారీ చేయడం జరిగింది. ఈ ప్రతిని పిర్యాదు దారిదైన జేఏసీ చైర్మన్ మూడావత్ రాంబాల్ నాయక్ కు కోడా అందజేశారు..

**నోటీస్ లోని అంశాలు....**
ఫైల్ నం.: NCST/DEV-8758/TS/1760/2026-RO-BHUV/RU-III
తేదీ: 31/08/2026
1. కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్,
రంగా రెడ్డి జిల్లా,
ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్,
కొంగర కలాన్ గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం,
రంగా రెడ్డి, తెలంగాణ -- 501510
1. సభ్య కార్యదర్శి,





GOVERNMENT OF INDIA
NATIONAL COMMISSION FOR SCHEDULED TRIBES
NOTICE
File No. NCST/DEV-8758/TS/1760/2026-RO-BHUV/RU-III
Date: 31/08/2026
1. The Collector & District Magistrate, District- Ranga Reddy, Integrated District Office Complexes, Kongara Kalan Village, Ibrahimpatnam Mandal, Ranga Reddy, (Telangana)-501510
2. The Member Secretary, Telangana State Pollution Control Board, Paryavaran Bhavan, A-3, Sanath Nagar Road, Sanath Nagar Industrial Estate, Hyderabad, (Telangana)-500018
Sub: Representation dated 22.08.2026 received from Shri M. Rambal Naik, Podagutta Thanda Eklashkhan Pet Kesampet Rangareddy District, Telangana regarding the waste water and other pollutants generated from the proposed establishment of a Dumping Yard at their area.
Whereas a Petition/ complaint/ information has been received by National Commission for Scheduled Tribes from Shri M. Rambal Naik dated 22/08/2026 as enclosed and the Commission has decided to investigate/inquire into the matter in pursuance of the powers conferred upon it under Article 338A of the Constitution of India. You are hereby requested to submit the facts and information on the action taken on the said allegations/matters to the undersigned within 15 day(s) of receipt of this notice either by post or in person or by any other means of communication.
Please take notice that in case the Commission does not receive reply from you within the stipulated time, the Commission may exercise the powers of Civil Court conferred upon it under of Article 338A of the Constitution of India and issue summons for your appearance in person or by a representative before the Commission.
Dr. P. Kalyan Reddy
Director
Copy to:
Shri M. Rambal Naik, Podagutta Thanda Eklashkhan Pet Kesampet Rangareddy, District- Ranga Reddy, (Telangana)- 509408
National Commission Scheduled Tribes is a Constitutional Body with powers of a Civil Court under Article 338-A of the Constitution of India

తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి,
పర్యావరణ భవన్, A-3,
సనత్ నగర్ రోడ్,
సనత్ నగర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్,
హైదరాబాద్, తెలంగాణ -- 500018

**విషయం:**
శ్రీ వీ. రాంబాల్ నాయక్, పొదుగట్టు తండా, ఎక్లాస్ఖాన్ పేట్, కేసంపేట్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ వారు 22/08/2026 తేదీన సమర్పించిన ఫిర్యాదు/ప్రాతినిధ్య పత్రం గురించి -- వారి ప్రాంతంలో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ ఏర్పాటు వల్ల ఉత్పత్తి అయ్యే మురుగునీరు మరియు ఇతర కాలుష్య పదార్థాలకు సంబంధించిన విషయం.
శ్రీ వీ. రాంబాల్ నాయక్ గారు 22/08/2026 తేదీన సమర్పించిన పిటిషన్/ఫిర్యాదు/సమాచారం జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్‌కు అందింది. దానికి సంబంధించిన పత్రం ఈ నోటీసుకు జతచేయబడింది.
ఈ విషయంపై విచారణ/దర్యాప్తు చేయాలని కమిషన్ నిర్ణయించింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 338ఎ కింద కమిషన్‌కు కల్పించబడిన అధికారాలను అనుసరించి ఈ నిర్ణయం తీసుకోబడింది.
అందువల్ల, పై ఆరోపణలు/విషయాలకు సంబంధించి మీరు తీసుకున్న చర్యలు మరియు సంబంధిత వాస్తవాలు, సమాచారాన్ని ఈ నోటీసు అందిన తేదీ నుండి 15 రోజుల్లోపు సంతకం చేసిన అధికారికి సమర్పించవలసిందిగా కోరుతున్నాము. దీనిని పోస్టు ద్వారా, స్వయంగా హాజరై లేదా ఇతర ఏదైనా సమాచార మార్గం ద్వారా సమర్పించవచ్చు.

**ముఖ్యమైన హెచ్చరిక:**
నిర్దేశించిన గడువులోగా కమిషన్‌కు మీ నుండి సమాధానం అందకపోతే, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 338ఎ ప్రకారం కమిషన్‌కు కల్పించబడిన సివిల్ కోర్టు అధికారాలను వినియోగించవచ్చు.
అలాగే, మీ హాజరు కోసం సమన్లు (Summons) జారీ చేసి, మీరు లేదా మీ ప్రతినిధి కమిషన్ ముందు వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఆదేశించవచ్చు.
డా. ౣ. కళ్యాణ్ రెడ్డి
డైరెక్టర్
జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్

**సింపుల్‌గా చెప్పాలంటే:**
ఇది శ్రీ రాంబాల్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదుపై జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ విచారణ ప్రారంభించిందని తెలియజేసే అధికారిక నోటీసు.
కమిషన్ రంగా రెడ్డి జిల్లా కలెక్టర్ మరియు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిని, ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై తీసుకున్న చర్యలు ఏమిటో 15 రోజుల్లోపు వివరించాలని కోరింది.
15 రోజుల్లో సమాధానం ఇవ్వకపోతే, కమిషన్ సివిల్ కోర్టుకు ఉన్న అధికారాలను ఉపయోగించి సమన్లు జారీ చేసి వ్యక్తిగతంగా లేదా ప్రతినిధి ద్వారా హాజరు కావాలని ఆదేశించవచ్చు.

# వైసీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి తీరుతాయి

-మంత్రి నారాయణ
-నిబంధనలు, కోర్టు ఆదేశాలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకుంటామన్న నారాయణ
-ఓటమి భయంతోనే వైసీపీ నేతలు కోర్టులను ఆశ్రయిస్తున్నారని ఎద్దేవా
-అభ్యర్థులు కూడా లేని దయనీయ పరిస్థితుల్లో వైసీపీ ఉందని వ్యాఖ్య

**అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** వైసీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా, కోర్టుల్లో కేసులు వేసినా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి తీరుతాయని ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. నిబంధనలు, న్యాయస్థానం ఆదేశాలకు అనుగుణంగానే ఎన్నికల నిర్వహణపై



నిర్ణయాలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో ఇప్పటికే రూ. 3,300 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించామని మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని చూసి తట్టుకోలేక ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు కోర్టులను ఆశ్రయిస్తున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు కూడా లేని దయనీయ స్థితిలో ఆ పార్టీ ఉందన్న ఆయన... అందుకే రాష్ట్రంలో ఎక్కడా ఎన్నికలు ఏకగ్రీవం కాకూడదని జగన్ తన నేతలకు హుకుం జారీ చేశారని ఎద్దేవా చేశారు.

**వైసీపీ నేతల ప్రచారం హాస్యాస్పదం...**
ఇదే సమయంలో... భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, వెలిగొండ ప్రాజెక్టుల క్రెడిట్ తమదేనని వైసీపీ నేతలు ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వం చేసిన చారిత్రక తప్పిదాలను, నిర్లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా సరిదిద్దుకుంటూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో తీసుకెళ్తోందని వివరించారు. నెల్లూరు నగరంలో కాలువల కట్టలపై ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేదలకు శాశ్వత పట్టాలు మంజూరు చేసే అంశంపై త్వరలోనే ప్రభుత్వం తీపి కబురు అందిస్తుందని హామీ ఇచ్చారు.

# సంక్షేమం-అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ పాలన

**పరిగి ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి**





**జర్నలిస్ట్ డైరీ పరిగి, సెప్టెంబర్ 01:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం,రాష్ట్ర సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని పరిగి ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం పరిగి రైతు వేదికలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన జనరల్ బాడీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.రాబోయే ఎల్‌నినో ప్రభావాన్ని, వర్షాభావ పరిస్థితులను అధిగమించడానికి గ్రామాల్లో ‘జలసిరి’ కింద ఇంటింటికీ ఇంకుడు గుంత (రూ. 6,500), పొలాల్లో ఫార్మ్ పాండ్స్ (రూ. 15,000), ఊటకుంటల నిర్మాణాలను వేగవంతం చేసి భూగర్భ జలాలను పెంచాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో 45 రేషన్ దుకాణాల పరిధిలో 18,482 నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అర్హులకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.
నియోజకవర్గ అభివృద్ధి పనులను వివరిస్తూ.. కొందుర్గ్--పరిగి--లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు భూసేకరణకు రూ. 587 కోట్లు, పరిగి మున్సిపాలిటీకి రూ. 20 కోట్లు, అత్యాధునిక ప్రభుత్వ ఆసుపత్రికి రూ. 27 కోట్లు, ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి రూ. 200 కోట్లతో పాటు రూ. 185 కోట్ల విలువైన =డదీ రహదారి పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో రైతు రుణమాఫీ ద్వారా సుమారు రూ. 300 కోట్ల మేర లబ్ధి చేకూరిందని, రైతు భరోసా, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి వంటి సంక్షేమ పథకాలను పారదర్శకంగా అర్హులకు అందిస్తున్నామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, జెడ్పీ సీఈవో సుధీర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పార్థసారథి పంతులు, మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత వెంకటేష్, ఎంపీడీవో హరిప్రియ రెడ్డి, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ వర్ధంతికి తరలిరండి


-ఉదయం 9.30 గంటలకు నూతన విగ్రహావిష్కరణ
-కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇబ్రహీం ఆహ్వానం



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 01 (జర్నలిస్ట్ డైరీ) :** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా సెప్టెంబర్ 2న షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని రాజీవ్ గాంధీ విగ్రహం పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి వైఎస్సార్ అభిమానులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, విలేకరులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎండీ ఇబ్రహీం ఆహ్వానం పలికారు. సెప్టెంబర్ 2న ఉదయం 9.30 గంటలకు జరిగే కార్యక్రమానికి అందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# ఊరకుంట పోచమ్మ తల్లి బోనాల్లో బీజేపీ నాయకుల ప్రత్యేక పూజలో పాల్గొన్న

**బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి**



**మిడ్జిల్, సెప్టెంబర్ 1 (జర్నలిస్ట్ డైరీ)**
జడ్చర్ల మున్సిపల్ పరిధిలోని ఊరకుంటలో శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బోనాల కమిటీ అధ్యక్షుడు విక్కీ, సభ్యులు శివ, ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో బీజేపీ నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, జడ్చర్ల పట్టణ అధ్యక్షుడు ఎడ్ల అమర్నాథ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకట్, రాష్ట్ర నాయకులు , జిల్లా ఉపాధ్యక్షుడు రాపోతుల శ్రీనివాస్ గౌడ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితి రెడ్డి, కిసాన్ మోర్చా నాయకులు మురళీకృష్ణ, నాయకులు కుమార్, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోచమ్మ తల్లి ఆశీస్సులతో జడ్చర్ల నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యం, అభివృద్ధి నెలకొనాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. బోనాల పండుగ సందర్భంగా భక్తులు, స్థానిక ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

## ఎల్ఐసి లో కెవి సేవలు ఎంతో అభినందనీయం

### -శాటిలైట్ బ్రాంచ్ మేనేజర్ గోపాల్



**పొదిలి ఆర్సీ, జర్నలిస్ట్ డైరీ :** భారతీయ జీవిత బీమా సంస్థలో సుదీర్ఘకాలం విశేష సేవలు అందించిన కే.వెంకటేశ్వర్లు సేవలు అభినందనీయమని స్థానిక శాటిలైట్ బ్రాంచ్ మేనేజర్ ఈ గోపాల్ అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏ ఓ గా పని చేసి బదిలీపై వెళ్లి ఇంకొల్లు సాటిలైట్ బ్రాంచ్ లో సోమవారం రిటైర్ అయిన కే.వెంకటేశ్వర్లు సన్మాన కార్యక్రమం స్థానిక కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 37 సంవత్సరాలుగా ఎల్ఐసి లో వివిధ స్థాయిలలో సేవలు అందించడం ఎంతో అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు - రాజేశ్వరి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏ ఓ పి సుబ్బారావు, అభివృద్ధి అధికారులు పి సుబ్రహ్మణ్యం పి. చిరంజీవి వీరయ్య, లికాయ్ (ఎల్.ఐ.సి.ఏ.ఓ.ఐ) ఎస్.సి.జెడ్ సభ్యులు నర్రా వెంకటేశ్వర రెడ్డి, లియోఫీ మార్కాపురం బ్రాంచ్ అధ్యక్షులు పి.బాలసయ్య, సీనియర్ ఏజెంట్లు మేడా నరసింహారావు, కుకట్ల ఆదినారాయణ, అరవింద మల్లికార్జున, మోరా శ్రీరాములు రెడ్డి, దేవిరెడ్డి ఆంజనేయులు, వెలుగొండయ్య, యమ్.గిరి శేఖర్, కిలారి రామకృష్ణ, కొండా తిరుపతి రెడ్డి, కె శేషగిరిరావు, టి. సుబ్బారావు, గొట్లగట్టు శ్రీను, కె ఎస్ ఎన్ చౌదరి, బాజీ, ఏజెంట్లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉపయేగపడే స్టడీ సర్కిల్ ఏర్పటు చేయాలి

### సంగటి ప్రసాద్ డిమాండ్



**జర్నలిస్టు డైరీ, కొత్తపేట..** కొత్తపేట చౌరస్తాలోని పాత కోర్టు స్థలం వేలాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని కామన్ మ్యాన్ ఫోరమ్ ఫర్ సోషల్ జస్టిస్ వ్యవస్థాపక అధ్యక్షులు సంగటి ప్రసాద్ డిమాండ్ చేశారు. కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తపేటలోని పాత కోర్టు ప్రభుత్వ స్థలం ప్రజల అవసరాల కోసం ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉపయోగపడే విధంగా ఉంచాలని సూచించారు. పాత కోర్టు స్థలాన్ని వేలం వేయకుండా ఆ స్థలంలో ఈ ప్రాంతంలోని విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని స్టడీ సర్కిల్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయడం వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రభుత్వం మంచి భవిష్యత్తు ఇచ్చిన వారు అవుతారని తెలిపారు. అద్దె భవనాలలో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలను కూడా ఈ భవనంలోకి తరలించాలని, దీంతో ప్రజలకు కూడా సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ప్రజా అవసరాల కోసం ఉపయోగపడే స్థలాన్ని విక్రయించి ప్రజలకు అన్యాయం చేయవద్దన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి కానీ ప్రభుత్వ స్థలాన్ని విక్రయించడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకోకపోతే తాము పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్య ప్రకాష్, మంద ఎల్లయ్య, వినోద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ బాధితుల ప్రాణరక్షణే ధ్యేయం

### -ఇందుకోసం కలిసి పనిచేద్దాం




**ఒంగోలు,ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** రోడ్డు ప్రమాదాల నివారణ, బాధితుల ప్రాణరక్షణే ధ్యేయంగా కలిసి పని చేద్దామని ' సేవ్ లైఫ్ ఫౌండేషన్ ' ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. మంగళవారం ఆ సంస్థ ప్రతినిధులతో జరిగిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తన నేతృత్వంలో ఎస్పీ, డిటిసి, డిఎంహెచ్వో, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ప్రతినిధులు, ఇతర అధికారులతో కూడిన 'రహదారి భద్రత కమిటీ ' తీసుకుంటున్న చర్యలను, ఫలితంగా వచ్చిన మార్పులను ఈ సందర్భంగా ఆయన వివరించారు. పరిస్థితిని మరింత మెరుగుపరిచేందుకు కలిసివచ్చే సంస్థలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దీనిపై సేవ్ లైఫ్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తమ సంస్థ సాంకేతిక సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. 'జీరో ఫెటాలిటీ డిస్ట్రిక్ట్ లక్ష్యంగా తాము పని చేస్తున్నట్లు వివరించారు. ఈ క్రమంలో ప్రకాశం జిల్లా అధికార యంత్రాంగంతో కూడా పనిచేసేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను అభినందిస్తూ, భవిష్యత్తులో ఎలాంటి సహకారం కావాలన్నా అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సమావేశంలో డిటిసి సుశీల, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# మైనారిటీ మహిళలకు రూ.50 వేల ఆర్థిక చేయూత

### - ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన పథకం కింద శేరిలింగంపల్లి నియోజకవర్గ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 01 (జర్నలిస్ట్ డైరీ) :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన పథకం కింద అర్హులైన 232 మంది లబ్ధిదారులలో 225 మందికి మైనారిటీ లకు 100% సబ్సిడీతో కోటి 12 లక్షల 50 వేల విలువ గల చెక్కులను గౌరవ రాష్ట్ర ఐటీ ఀ పరిశ్రమల శాఖ మంత్రి వర్యులు శ్రీ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు గారు, గౌరవ శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ శ్రీ పట్నం మహేందర్ రెడ్డి గారు, గౌరవ ఎమ్మెల్యే శ్రీ మల్లారెడ్డి గారు, గౌరవ కలెక్టర్ శ్రీ మను చౌదరి గారు,గౌరవ రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ ఒబేదుల్లా కొత్వాల్ గారు, గౌరవ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ బండి రమేష్ గార్ల తో కలిసి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన గౌరవ౹ాజ చైర్మన్ శ్రీ ఆరెక పూడి గాంధీ గారు .

ఈ సందర్భంగా ౹ాజ చైర్మన్ గాంధీ గారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ రేవంత్ రెడ్డి గారు మహిళా సాధికారికత కోసం ఎంతగానో కృషి చేస్తున్నారు అని, మహిళలు ఆర్థికంగా స్వశక్తితో ఎదగనడానికి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగినది అని, గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ రేవంత్ రెడ్డి గారు మహిళ పక్షపాతి అని, ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల లోపు ఉచిత కరెంట్, అదేవిదంగా మైనారిటీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లిఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన పథకంలి కింద అర్హులైన మహిళలకు రూ.50 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించడం జరుగుతుంది అని గొప్ప కార్యక్రమం అని ఈ ఆర్థిక సహాయంతో మైనారిటీ మహిళలు చిన్నతరహా వ్యాపారాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం ఏర్పడుతుందని , కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకోవడంతో పాటు మహిళలు స్వతంత్రంగా ఆదాయం పొందేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని PAC చైర్మన్ గాంధీ గారు తెలియచేశారు.మైనారిటీ మహిళలకు ఆర్థికంగా అండగా నిలవడం ద్వారా వారి కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని PAC చైర్మన్ గాంధీ గారు తెలియచేశారు.

రూ.50 వేల ఆర్థిక సహాయం అందుకోవడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. తమకు ఆర్థికంగా అండగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వానికి, గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ రేవంత్ రెడ్డి గారికి, గౌరవ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు, గౌరవ ఎమ్మెల్యే శ్రీ ఆరెక పూడి గాంధీ గార్ల కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు

83 మంది ఎంపిక చేయబడిన వారిలో 57 మందికి తుర్క కాశ మైనారిటీలకు స్టోన్ కటింగ్ జనరేటర్ మరియు టూల్ కిడ్స్ ల పంపిణీ.

414 మంది లబ్ధిదారుల లక్ష్యంలో ప్రస్తుతం 112 మందికి ఈ - స్కూటీలు పంపిణీ ఏర్పాట్లు.

జిల్లాలో 900 మంది మైనారిటీ చిరు వ్యాపారులకు ఆర్థిక సహాయం అందిస్తాం.

జిల్లాలో 37 మంది మైనారిటీ విద్యార్థులకు విదేశీ విద్య కోసం సీఎం ఓవర్సీస్ పథకం కింద 8 కోట్ల 23 లక్షలు ప్రభుత్వం అందిస్తుంది.

మేడ్చల్ జిల్లాలో 2025-26 లో ఇంటర్ ఆ పై స్థాయి మైనారిటీ విద్యార్థులకు ఉపకార వేతనాలు కోసం రూ. 27 కోట్ల 14 లక్షలు అందిస్తున్నాం.

జిల్లాలో 563 మందికి కుట్టు మిషన్స్ పంపిణీ చేస్తున్నాం తెలియచేశారు.

# అర్హులైన ప్రతి 'నిర్వాసిత' కుటుంబానికి 'న్యాయం' చేస్తాం

**-వెలిగొండ ప్రాజెక్టుపై మార్కాపురం జిల్లా కలెక్టర్**

**ఎం. విజయ సునీత.**

**-రూ.175 కోట్లతో ఆర్ అండ్ ఆర్, అదనపు పరిహారం జీవోలు విడుదల**

**-మార్కాపురం ప్రజల 30 ఏళ్ల కల నెరవేరిందన్న కలెక్టర్**

**-నాలుగు జిల్లాల పరిధిలోని 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు,**

**-23 లక్షల మందికి తాగునీరు.**



**మార్కాపురం, బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** మార్కాపురం ప్రాంత ప్రజలతో పాటు ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలు సుమారు 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు (నల్లమల సాగర్) జలాలు అందుబాటు లోకి రావడం ఒక చారిత్రాత్మక ఘట్టమని మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టును విజయవంతంగా ప్రారంభించిన సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టరేట్లో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...

ముఖ్యమంత్రి చేతుల మీదుగా నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలను విడుదల చేయడంతో ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల సాకారమైందని సంతోషం వ్యక్తం చేశారు.అనంతరం వెలిగొండ ప్రాజెక్ట్ గురించి పలు అంశాలను గురించి వెల్లడించారు..

**చారిత్రాత్మక ప్రారంభం...**

1996 మార్చి 5న రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టు, 30 ఏళ్ల తర్వాత మళ్లీ గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగానే జాతికి అంకితం కావడం ఎంతో శుభపరిణామని పేర్కొన్నారు.

ఇంజనీరింగ్ అద్భుతం:

శ్రీశైలం జలాశయంలోని కొల్లాపూర్ వద్ద నుంచి 43.50 టీఎంసీల కృష్ణా వరద జలాలను 18 కిలోమీటర్ల పొడవైన జంట సొరంగాల ద్వారా తరలించి, 21 కిలోమీటర్ల ఫీడర్ కాలువ ద్వారా నల్లమల సాగర్‌కు పంపిస్తున్నారని తెలిపారు.

**మహత్తర ప్రయోజనాలు:**

4 జిల్లాల పరిధిలోని ముఖ్య మండలాల్లో 4.4 లక్షల ఎకరాలకు సాగునీరు, దాదాపు 23 లక్షల మంది ప్రజలకు శాశ్వత తాగునీటి సదుపాయం లభిస్తుందని వివరించారు. ఫ్లోరైడ్ రహిత నీటి సదుపాయంతో పాటు రాయలసీమ హార్టికల్చర్ హబ్‌లో మార్కాపురం భాగం కావడం ద్వారా ఆర్థిక, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని స్పష్టం చేశారు.

**సామర్థ్యం పెంచిన తీరు:**

నల్లమల సాగర్ జలాశయంలో సుంకేసుల, గొట్టిపడియ, కాకర్ల గ్యాప్‌లను పూరించడం ద్వారా 53.85 టీఎంసీల నీటిని నిల్వ చేసే సామర్థ్యాన్ని అందుబాటులోకి తెచ్చామని తెలియజేశారు.

**పునరావాసం మరియు ఆర్ అండ్ ఆర్ వివరాలు:**

నిర్వాసితుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రాజెక్టు పరిధిలోని 11 ముంపు గ్రామాల నుంచి 7,321 నిర్వాసిత కుటుంబాలను (పిడీర్) 7 ఆర్ అండ్ ఆర్ కాలనీలకు తరలించడం జరుగుతోందని వెల్లడించారు.

**పరిహారం పంపిణీ:**

ఇప్పటికే 85డేట్నుండి 90జె మందికి (6,200 పైగా కుటుంబాలకు) అవార్డులు పూర్తి చేసి నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు. కేవలం 312 వివాదాస్పద/కోర్టు కేసులు, పత్రాల సమర్పణ లేనివి మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

**రూ. 165 కోట్ల జీవో విడుదల:**

అదనపు అర్హులైన నిర్వాసితులకు (మేజర్ సన్స్ ఀ డాటర్స్, గెజిట్ లో పేర్లు మిస్సయిన వారు) పరిహారం అందించేందుకు ప్రభుత్వం రూ. 165 కోట్లతో జీవో విడుదల చేసిందని వ్యాఖ్యానించారు. మేజర్ కుమారులు/కుమార్తెలకు రూ. 2 లక్షల చొప్పున సాయం అందుతుందని తెలియజేశారు.

**ప్రత్యేక సంక్షేమ ప్యాకేజీ (రూ. 4.25 కోట్లు):**

10,000 కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకుల కిట్‌లు (రూ. 3 కోట్లు), 6,000 మంది మహిళలకు గృహప్రవేశ కానుక కిట్‌లు (రూ. 60 లక్షలు), పశుగ్రాసం కోసం రూ. 65.72 లక్షలు, మొత్తంగా రూ. 175 కోట్ల ఆర్థిక భారంతో నిర్వాసితుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.

**ఇంటి స్థలం-పట్టాల పంపిణీ:**

ఆర్ అండ్ ఆర్ కాలనీలలో మౌలిక వసతుల పనులు తుది దశకు చేరుకున్నాయని, నిబంధనల ప్రకారం 3,961 నిర్వాసిత కుటుంబాలకు, ఓ.టి.ఎస్ కింద 3,300 మందికి పట్టాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పట్టాలు సిద్ధంగా ఉన్నందున నిర్వాసితులు వెంటనే వచ్చి స్వీకరించాలని కలెక్టర్ కోరారు. శ్మశాన వాటికలు, అదనపు ప్లాట్ల కోసం 20 ఎకరాల భూసేకరణ నిమిత్తం మరో రూ. 8 కోట్లు వెచ్చించనున్నామని తెలియజేశారు. గవర్నమెంట్ ఎస్ఓపీ మరియు డిజిటల్ డేటాబేస్ ఆధారంగా అర్హులైన ప్రతి ఒక్క పి.డి.ఎఫ్ కుటుంబానికి పూర్తిస్థాయిలో లబ్ధి చేకూరేలా చూస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రాజెక్టును విజయవంతం చేసిన మీడియా మిత్రులకు, సహకరించిన అధికారులకు, ఉద్యోగులకు ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.'

# బ్రాహ్మణ సంక్షేమానికి ప్రభుత్వం పూర్తి సహకారం

### పరిషత్‌కు నిధుల విడుదలకు ఆదేశాలు

**నాగారం, సెప్టెంబరు 1:-(జర్నలిస్ట్ డైరీ)** తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి దుదిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ను కలిసి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ కార్యకలాపాలు, పేద బ్రాహ్మణుల సంక్షేమ కార్యక్రమాలకు నిధుల కొరత లేకుండా చూడాలని చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పెండింగ్‌లో ఉన్న రూ.6 కోట్ల నిధులతో పాటు ఇప్పటికే అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ పొందిన రూ.25 కోట్లను కూడా వెంటనే విడుదల చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బ్రాహ్మణ సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధికి ఈ నిర్ణయం నిదర్శనమని ఈ సందర్భంగా బసవరాజు శ్రీనివాస్ పేర్కొన్నారు. పేద మరియు మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబాల అభ్యున్నతి, విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబన వంటి అంశాల్లో పరిషత్ ద్వారా



మరింత విస్తృతంగా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టేందుకు ఈ నిధులు దోహదపడతాయని తెలిపారు. "బ్రాహ్మణ సమాజ సంక్షేమం కోసం ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, అవసరమైన నిధులను విడుదల చేయడానికి ముందుకు రావడం అభినందనీయం. ఇది తెలంగాణ బ్రాహ్మణ సమాజంపై ప్రభుత్వం చూపుతున్న గౌరవం, చిత్తశుద్ధికి నిదర్శనం" అని బసవరాజు శ్రీనివాస్ అన్నారు.

ఈ సందర్భంగా యావత్ తెలంగాణ బ్రాహ్మణ సమాజం తరపున ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి మరియు ఆర్థిక శాఖ మంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్కకి, బ్రాహ్మణులు అభివృద్ధి ప్రదాత, రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి దుదిళ్ల శ్రీధర్ బాబుకి బసవరాజు శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

"రాజకీయాలకు, ప్రాంతాలకు, శాఖా భేదాలకు అతీతంగా బ్రాహ్మణ సమాజం ఐక్యంగా ఉండి, ప్రభుత్వంతో సమన్వయంతో ముందుకు సాగితే మన సమాజ అభివృద్ధికి మరిన్ని అవకాశాలు సాధించుకోవచ్చు. బ్రాహ్మణుల సంక్షేమం, ఆత్మగౌరవం, ఆర్థిక స్వావలంబన కోసం అందరం ఐక్యంగా కృషి చేద్దాం" అని బసవరాజు శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

# పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా ఉపాధ్యాయుల నిరసన

### సీపీఎస్ రద్దు చేసి.. ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి
### నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపిన ఘడియ గౌరారం జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు




**చింతపల్లి, సెప్టెంబర్ 1 (జర్నలిస్ట్ డైరీ)** పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ చింతపల్లి మండలం ఘడియ గౌరారం జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు.

భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు నల్లబ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఉద్యోగుల పదవీ విరమణ అనంతర భవిష్యత్ భద్రతకు ఓపీఎస్ ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు.

సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి.. ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

# చింతపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులపై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి

### టీఎస్‌యూటీఎఫ్ చింతపల్లి మండల శాఖ




**చింతపల్లి, సెప్టెంబర్ 1 (జర్నలిస్ట్ డైరీ)** చింతపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల వ్యవహారశైలి, ఉపాధ్యాయుల పట్ల అనుసరిస్తున్న విధానాలు, విధుల నిర్వహణ, సెలవులు, ఓడీ తదితర అంశాలపై వస్తున్న ఫిర్యాదులు, ఆరోపణలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కాశిరెడ్డి కృష్ణారెడ్డి మరియు చింతపల్లి మండల అధ్యక్షులు సిలువేరు నారాయణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చింతపల్లి కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల విధుల నిర్వహణ, ఓడీ, సెలవుల విషయంలో అనుసరిస్తున్న విధానాలు, షోకాజ్ నోటీసులు జారీ చేయడం తదితర అంశాలపై ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొందన్నారు. ఉపాధ్యాయులను ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులకు గురిచేయడం సరికాదని పేర్కొన్నారు. పాఠశాలల పర్యవేక్షణ పేరుతో టూర్ డైరీ నిర్వహణ, పాఠశాలల సందర్శన, ఉపాధ్యాయులతో వ్యవహరిస్తున్న తీరు తదితర అంశాలను కూడా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని వారు కోరారు. సంబంధిత ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది నుంచి వివరాలు సేకరించి నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని ఆయన అన్నారు. విద్యాశాఖ అధికారులు ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపి చింతపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులపై నిబంధనల ప్రకారం శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు భయాందోళనలకు గురికాకుండా ప్రశాంతమైన వాతావరణంలో విధులు నిర్వహించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ జిల్లా సభ్యులు గోన దేవకుమార్, మండల ప్రధాన కార్యదర్శి ముసుగు ఆనంద్ బాబు పాల్గొన్నారు.

# "రీ సర్వే', 'పిజిఆర్ఎస్' లలో వెనుకంజలో ఉన్న మండల రెవెన్యూ అధికారులపై చర్యలు

### -జిల్లా కలెక్టర్ న్. పి. రాజబాబు

**ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** మంగళవారం ఉదయం అమరావతి నుంచి సీసీఎల్ఏ మరియు స్పెషల్ సీఎస్ టు గవర్నమెంట్ జయలక్ష్మి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పి. రాజబాబు క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె భూముల రీ సర్వే, పిజిఆర్ఎస్, 22 ఏ తదితర అంశములపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ జీవోలు రెవెన్యూ కాన్ఫరెన్స్ కూడా ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు ఎప్పటికప్పుడు ఆయా గ్రామాలలో తిరిగి మండల రెవెన్యూ అధికారి లాగిన్స్ లో

పిజిఆర్ఎస్ పెండింగ్ లేకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అక్టోబర్ నెల వరకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని తదనుగుణంగా ఒక సమగ్ర ప్రణాళిక రూపొందించుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. భూముల రీ సర్వే, పిజిఆర్ఎస్ లలో వెనుకంజలో ఉన్న మండలాల రెవెన్యూ అధికారులపై, మరియు అలసత్వం వహించిన అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రీసెర్వే పూర్తి చేసిన గ్రామాలలో పట్టాదారు పాస్



పుస్తకాలు సత్వరమే అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రెవెన్యూ డివిజన్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించాలన్నారు. ప్రతి అర్జీ దారునితో ఫోన్లో విధగా మాట్లాడి వారి సంతృప్తి స్థాయి ని పెంచాలని సూచించారు. సెన్సస్ - 2027 నిర్వహణపై ప్రభుత్వ సూచనలు విధిగా పాటించి నిర్దేశిత గడువులోపల పూర్తి చాయాలని సంబందిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వెంకటరమణ, పి జి ఆర్ ఎస్ పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

# అక్షర ఆంధ్రకు అద్భుత ఫలితాలు..వచ్చే సెప్టెంబరుకు 100 శాతం అక్షరాస్యత

**-మంత్రి నారా లోకేశ్**

**-పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖలపై మంత్రి నారా లోకేశ్ సమీక్ష**

**-అక్షర ఆంధ్ర కార్యక్రమంతో ఏడాదిలో 25 లక్షల మందికి అక్షరజ్ఞానం**

**-బడిబయట ఉన్న 1.64 లక్షల మంది పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశం**

**-మధ్యాహ్న భోజనంపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని తల్లిదండ్రులకు, టీచర్లకు సూచన**

**-ఇంటర్ విద్యార్థులకు 'తల్లికి వందనం' కింద రూ.1051 కోట్ల ఆర్థిక సాయం**

**అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసి, సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 'అక్షర ఆంధ్ర' కార్యక్రమం ఉద్యమంలా సాగుతోందని, దీని ద్వారా వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి రాష్ట్రాన్ని వంద శాతం అక్షరాస్యత సాధించిన రాష్ట్రంగా నిలపాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

ఉండవల్లిలోని తన నివాసంలో మంగళవారం పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖల ఉన్నతాధికారులతో మంత్రి నారా లోకేశ్ సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా విద్యావ్యవస్థలో చేపడుతున్న సంస్కరణలు, కార్యక్రమాల పురోగతిని ఆయన సమీక్షించారు.

**ఈ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ...**

2024 నాటికి రాష్ట్ర అక్షరాస్యత శాతం కేవలం 72.6 శాతంతో దేశంలోనే అట్టడుగున ఉందని, అయితే గత ఏడాదిగా కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో కేవలం ఒక్క ఏడాదిలోనే 25 లక్షల మంది నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా మారారని తెలిపారు. ఈ కృషిని కేంద్ర ప్రభుత్వం కూడా అభినందించిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకురాగా, ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ఇటీవల కేంద్రం విడుదల చేసిన వయోజన విద్య పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర అక్షరాస్యత శాతం 10 శాతం పెరిగి 82.1 శాతానికి చేరుకుందని, ఇదే స్ఫూర్తితో 2027 సెప్టెంబర్ నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని కోరారు. ఇందుకు అనుగుణంగా 2027 మార్చి నాటికి మరో 25 లక్షల మందిని, ఆపై సెప్టెంబర్ నాటికి మిగిలిన 27 లక్షల మందిని అక్షరాస్యులుగా





మార్చేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు వివరించారు. 11 ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ బృహత్ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేసి, ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు.

**సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు...**

ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహణ, పదో తరగతి విద్యార్థుల కోసం 'మిషన్ మార్చి-2026'పై కూడా సమావేశంలో చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా 125 కేంద్రాల్లో ఆటిజం సెంటర్లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి శ్యామలరావు, సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు, పాఠశాల విద్య మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# చిల్వేర్ పాఠశాలలో విద్యార్థులకు బూట్లు, బెల్టులు, టైలు పంపిణీ



మిడ్జిల్, సెప్టెంబర్ 01, (జర్నలిస్ట్ డైరీ)
మిడ్జిల్ మండలంలోని చిల్వేర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బూట్లు, బెల్టులు, టైలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు గౌడ్, హెచ్ఎం శ్యామల, ఉపాధ్యాయులు రమేష్, వెంకటయ్య, హరియానాయక్, గురు ప్రసాద్, పంచాయతీ సెక్రటరీ ఖలీలొద్దీన్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 420 హామీలపై నేటి నుంచి బీఆర్ఎస్ పోరుబాట

**సెప్టెంబర్ 2 నుంచి 7 వరకు వివిధ అంశాలపై నిరసనలు..**
**'బాకీ కార్డు' ఉద్యమం...**







పటాన్ చెరు సెప్టెంబర్ 1(జర్నలిస్ట్ డైరీ)
సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం పటాన్‌చెరులోని క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశమైన ఎమ్మెల్యే ఉద్యమ కార్యాచరణను వెల్లడించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో పాటు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ప్రజలకు ఇవ్వాల్సిన బాకీలను ఎప్పటిలోగా చెల్లిస్తారో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ సెప్టెంబర్ 2 నుంచి 7వ తేదీ వరకు పటాన్‌చెరు నియోజకవర్గంలో వివిధ నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఆదేశాల మేరకు 'బాకీ కార్డు' ఉద్యమం చేపట్టనున్నట్లు చెప్పారుసెప్టెంబర్ 2న పటాన్‌చెరులో ర్యాలీ, బాకీ కార్డుల పంపిణీ, 420 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శన; 3న ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్‌పై ర్యాలీలు; 4న కొల్లూరులో డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద ధర్నా; 5న గుమ్మడిదలలో రైతు సదస్సు; 6న తాగునీరు, వీధి దీపాలు, శాంతిభద్రతల సమస్యలపై దీఎజూా నుంచి ఇస్నాపూర్ వరకు ఆటోల ర్యాలీ; 7న ప్రజావాణిలో 420 హామీల అమలుపై వినతిపత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, రైతులు, కార్మికులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# ఊరకుంట పోచమ్మ తల్లి బోనాల్లో బీజేపీ నాయకుల ప్రత్యేక పూజలో పాల్గొన్న

**బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి**





మిడ్జిల్, సెప్టెంబర్ 1 (జర్నలిస్ట్ డైరీ)
జడ్చర్ల మున్సిపల్ పరిధిలోని ఊరకుంటలో శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బోనాల కమిటీ అధ్యక్షుడు విక్కీ, సభ్యులు శివ, ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో బీజేపీ నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి, జడ్చర్ల పట్టణ అధ్యక్షుడు ఎడ్ల అమర్నాథ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకట్, రాష్ట్ర నాయకులు , జిల్లా ఉపాధ్యక్షుడు రాపోతుల శ్రీనివాస్ గౌడ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితి రెడ్డి, కిసాన్ మోర్చా నాయకులు మురళీకృష్ణ, నాయకులు కుమార్, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోచమ్మ తల్లి ఆశీస్సులతో జడ్చర్ల నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యం, అభివృద్ధి నెలకొనాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. బోనాల పండుగ సందర్భంగా భక్తులు, స్థానిక ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

# తొలిసారిగా లివర్, కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతం

**-కర్నూలు జిల్లా వైద్య చరిత్రలో సరికొత్త అధ్యాయం**
**-ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్**
**-సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించిన గౌరిగోపాల్ హాస్పిటల్,**
**-హైదరాబాద్‌లోని టీఎక్స్ ఆసుపత్రి**
**-67 ఏళ్ల అశోక్ కు కాలేయ మార్పిడి శస్త్రచికిత్స**
**-ఇప్పటి వరకు పెద్ద నగరాలకే పరిమితమైన ఇటువంటి ఆపరేషన్లు**



కర్నూలు, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
కర్నూలు జిల్లా వైద్య చరిత్రలో సరికొత్త అధ్యాయం ఆవిష్కృతమైందని, తొలిసారిగా విజయవంతంగా లివర్, కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ వెల్లడించారు. గౌరిగోపాల్ హాస్పిటల్, హైదరాబాద్‌లోని టీఎక్స్ హాస్పిటల్ సంయుక్తంగా, 'జీవనదాన్ ఆంధ్రప్రదేశ్' సహకారంతో ఈ అరుదైన మైలురాయిని సొంతం చేసుకున్నాయని కొనియాడారు.

**67 ఏళ్ల అశోక్‌కు కాలేయ (లివర్) మార్పిడి,26 ఏళ్ల షేక్ జబీ ఉల్లాకు మూత్రపిండాల (కిడ్నీ) మార్పిడి..**

ఈ సంక్లిష్ట శస్త్రచికిత్సలలో భాగంగా 67 ఏళ్ల అశోక్‌కు కాలేయ (లివర్) మార్పిడి, అలాగే 26 ఏళ్ల షేక్ జబీ ఉల్లాకు మూత్రపిండాల (కిడ్నీ) మార్పిడి ఆపరేషన్లను వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. అనుభవజ్ఞులైన నిపుణులైన వైద్య బృందం దాదాపు 20 గంటల పాటు నిరంతరం శ్రమించి ఈ ప్రాణరక్షణ ప్రక్రియను పూర్తి చేశారని, ప్రస్తుతం ఇద్దరు రోగులు కోలుకుంటూ వైద్యుల పర్యవేక్షణలో పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని మంత్రి స్పష్టం చేశారు.

**అత్యంత క్లిష్టమైన అవయవ మార్పిడి చికిత్సలు ఇప్పుడు కర్నూలులోనే**

ఇంతవరకు హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు వంటి మహానగరాలకే పరిమితమైన ఇటువంటి అత్యంత క్లిష్టమైన అవయవ మార్పిడి చికిత్సలు ఇప్పుడు కర్నూలులోనే అందుబాటులోకి రావడం రాయలసీమ ప్రాంత ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని టీజీ భరత్ వ్యాఖ్యానించారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి కుటుంబ సభ్యులు ముందుకు వచ్చి అవయవ దానం చేయడం ద్వారా మరొకరికి పునర్జన్మ నిచ్చారని, వారి మానవతా దృక్పథం ఎంతో అభినందనీయమని చెప్పారు. కర్నూలును వైద్య హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో ఈ విజయం ప్రజల్లో కొత్త నమ్మకాన్ని, భరోసాను నింపిందని మంత్రి కొనియాడారు

# మొగల్తూరులో సీఎం చంద్రబాబు పడవ ప్రయాణం...









**-మత్స్యకారుల సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై ఆరా**
**/వారి ఆహ్వానం మేరకు పడవలో ప్రయాణించి కష్ట సుఖాల విచారణ**
**-మత్స్యకారుల భద్రతే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని స్పష్టీకరణ**
**-వేట నిషేధ సాయం అందుతోందని సీఎంకు తెలిపిన మత్స్యకారులు**

మొగుల్తూరు, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించారు. టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి సొంతూరైన నర్సాపురం నియోజకవర్గంలోని మొగల్తూరులో ఆయన పర్యటన ఆసక్తికరంగా సాగింది. 'పేదల సేవలో' కార్యక్రమం కోసం వచ్చిన ఆయన, స్థానిక మత్స్యకారులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారి ఆప్యాయమైన ఆహ్వానం మేరకు పడవలో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు.పర్యటనలో భాగంగా తొలుత ఫెర్రీ పాయింట్‌కు చేరుకున్న సీఎం చంద్రబాబు, అక్కడ పడవల వద్ద ఉన్న మత్స్యకారులతో ముచ్చటించారు. తిరుమని స్వామి అనే మత్స్యకారుడికి స్వయంగా పింఛను అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని వారిని అడిగి తెలుసుకున్నారు. దీనిపై స్పందించిన మత్స్యకారులు, వేట నిషేధ సమయంలో ప్రభుత్వం అందిస్తున్న రూ.20 వేల ఆర్థిక సాయం తమ కుటుంబాలకు ఎంతో ఆసరాగా నిలుస్తోందని ముఖ్యమంత్రికి వివరించారు.

**వేటకు వెళ్లినప్పుడు ఎన్ని రోజులు సముద్రంలో ఉంటారు?**

సీఎంతో సంభాషణ సందర్భంగా ఓ మత్స్యకారుడు తమతో పాటు పడవలోకి రావాలని ఆప్యాయంగా ఆహ్వానించారు. ఆ ఆహ్వానాన్ని చిరునవ్వుతో స్వీకరించిన చంద్రబాబు, వెంటనే పడవ ఎక్కి వారితో కలిసి కాసేపు ప్రయాణించారు. ఈ ప్రయాణంలో, సముద్రంలో వారి జీవనశైలి గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. "వేటకు వెళ్లినప్పుడు ఎన్ని రోజులు సముద్రంలో ఉంటారు? ఆ సమయంలో భోజన సదుపాయాలు ఎలా ఉంటాయి?" వంటి వివరాలను అడిగి వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు.

**మత్స్యకారులు గల్లంతవుతున్న ఘటనలపై చంద్రబాబు తీవ్ర ఆందోళన**

ఈ సందర్భంగా సముద్రంలో మత్స్యకారులు గల్లంతవుతున్న ఘటనలపై చంద్రబాబు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కోనసీమకు చెందిన మత్స్యకారులు దాదాపు 20 రోజులు సముద్రంలో చిక్కుకుపోయినప్పుడు, కోస్ట్‌గార్డ్, నేవీ వంటి కేంద్ర విభాగాల సహకారంతో వారిని ఎలా సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చారో గుర్తుచేశారు. మత్స్యకారుల భద్రతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, వారికి అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అధికారిక కార్యక్రమానికి హాజరైనప్పటికీ, చంద్రబాబు నేరుగా మత్స్యకారుల వద్దకు వెళ్లి, వారి పడవలో ప్రయాణించి వారిలో ఒకరిగా కలిసిపోవడం స్థానికులను ఆకట్టుకుంది

# పేదల ఆకలి తీర్చడమే 'అన్నా క్యాంటీన్ల' ప్రధాన లక్ష్యం

**-రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి.**





సింగరాయకొండ,ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
రాష్ట్రంలో పేదలు, నిరుపేదలు, దినసరి కూలీలు మరియు సామాన్య ప్రజల ఆకలి తీర్చడమే పరమోచ్ఛ లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేవలం రూ. 5 లకే రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందించే 'అన్నా క్యాంటీన్ల' వ్యవస్థను పునరుద్ధరించారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. మంగళవారం సింగరాయకొండ మండల కేంద్రంలోని అన్నా క్యాంటీన్‌ను మంత్రి ఆకస్మికంగా సందర్శించి, క్షేత్రస్థాయిలో నిర్వహణ తీరును పరిశీలించారు.?ఈ ఆకస్మిక తనిఖీ సందర్భంగా మంత్రి సాధారణ ప్రజలతో కలిసి క్యూలైన్‌లో నిలబడి రూ. 5 చెల్లించి భోజనం టోకెన్ తీసుకున్నారు. అనంతరం సామాన్యులతో పాటు కూర్చొని భోజనం చేశారు. భోజనం అత్యంత రుచికరంగా, పౌష్టికంగా ఉందనడానికి స్వయంగా తానే నిదర్శనమని పేర్కొంటూ ఆహార నాణ్యతకు కితాబిచ్చారు. అంతేకాకుండా క్యాంటీన్ లోపల, డైనింగ్ హాల్‌తో పాటు చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు కూడా చాలా శుభ్రంగా, పారిశుద్ధ్య నియమాలకు అనుగుణంగా ఉండటం గమనించి ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ నిర్వహణ సిబ్బందిని అభినందించారు.రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఆకలితో అలమటించకూడదనే మానవీయ దృక్పథంతోనే ముఖ్యమంత్రి ఈ మహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించారని మంత్రి వివరించారు. ఈ బృహత్తర యజ్ఞంలో సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యంగా ప్రజలు తమ ఇళ్లలో జరుపుకునే పుట్టినరోజులు, పెళ్లిరోజులు, కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థ వేడుకలు లేదా ఇతర శుభకార్యాల సందర్భాలలో అన్నా క్యాంటీన్లలో పేదలకు భోజన దాతలుగా (అన్నదాతలుగా) ముందుకు రావాలని ఆత్మీయ పిలుపునిచ్చారు.?విశేష దినాల్లో నిరుపేదల ఆకలి తీర్చడం వల్ల లభించే తృప్తి వర్ణనాత్మకమైనదని, దాతలు అందించే చిన్న సహకారం కూడా పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అన్నా క్యాంటీన్ల లోనూ ఇదే తరహా నాణ్యత, పరిశుభ్రత నిరంతరం కొనసాగేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి పునరుద్ఘాటించారు.

# రష్మిక నుంచి బ్యాక్ టూ బ్యాక్ సినిమాలు..

## మైసా రిలీజ్ డేట్ ప్రకటించిన మేకర్స్






నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉంది. ఇప్పటికే విభిన్నమైన కథలు, పాత్రలను ఎంచుకుంటూ పాన్ ఇండియా స్థాయిలో తన మార్కెట్‌ను మరింత పెంచుకుంటున్న ఈ భామ.. ఇప్పుడు మరో ఆసక్తికరమైన సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. రష్మిక ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా మూవీ 'మైసా' విడుదల తేదీ ఖరారైంది. 'మైసా' చిత్రాన్ని 2026 నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా రష్మిక చేతిలో ఈటె పట్టుకుని, అత్యంత పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించే ఇంటెన్స్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. ఇప్పటివరకు గ్లామర్, లవ్, ఫ్యామిలీ, కామెడీ వంటి విభిన్న పాత్రల్లో కనిపించిన రష్మిక.. 'మైసా'లో మాత్రం పూర్తిగా భిన్నమైన అవతార్‌లో కనిపించనుంది. ఇందులో ఆమె గోండ్ గిరిజన మహిళ, తిరుగుబాటుదారిణి పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. పాత్ర కోసం రష్మిక తన లుక్, బాడీ లాంగ్వేజ్‌లోనూ భారీ మార్పులు తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. 'మైసా' కథ గిరిజన ప్రాంతాల నేపథ్యంలో సాగుతుందని తెలుస్తోంది. అక్కడి ప్రజల జీవన విధానం, వారి నమ్మకాలు, సమస్యలు, పోరాటం వంటి అంశాలను కథలో చూపించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా రష్మిక పాత్ర చుట్టూనే కథనం ఎక్కువగా నడుస్తుందని టాక్. ఈ సినిమాలో రష్మిక ఇప్పటివరకు చేయని యాక్షన్ షేడ్స్‌తో కూడిన పాత్రలో కనిపించనుంది. చేతిలో ఈటె పట్టుకుని కనిపిస్తున్న పోస్టర్ చూస్తే.. సినిమాలో ఆమె పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందో అర్థమవుతోంది. ఈ సినిమా కోసం రష్మిక అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'మైసా'తో రవీంద్ర పుల్లె దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ కొనసాగుతోంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని అనిల్, అజయ్ సయ్యపురెడ్డి, శ్రీకాంత్ సాతి కలిసి అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. తారక్ పొన్నప్ప కీలక పాత్రలో నటిస్తున్నారు. కథకు తగ్గట్టుగా భారీ యాక్షన్ సన్నివేశాలు, గిరిజన నేపథ్యాన్ని ప్రతిబింబించే విజువల్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే రష్మికకు 2026 చివరి రెండు నెలలు మరింత ప్రత్యేకంగా మారనున్నాయి. ఇప్పటికే విజయ్ దేవరకొండతో కలిసి నటిస్తున్న 'రణబలి' చిత్రం అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆ తర్వాత కేవలం 42 రోజుల వ్యవధిలోనే 'మైసా' నవంబర్ 27న విడుదల కానుంది.



హాట్ అందాల డోస్ పెంచిన అనుపమా పరమేశ్వరన్,

# 'మారెమ్మ' ట్రైలర్ రిలీజ్..

## మిస్టీరియస్ ఎద్దు మిస్సింగ్‌తో ఊరంతా కలకలం!




మాస్ మహారాజ రవితేజ సోదరుడి తనయుడు మాధవ్ భూపతిరాజు ప్రధాన పాత్రలో తెరకెక్కిన విలేజ్ యాక్షన్ డ్రామా 'మారెమ్మ' ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో వచ్చిన టీజర్‌తో సినిమాపై ఆసక్తిని పెంచిన చిత్రబృందం.. ఇప్పుడు ట్రైలర్ ద్వారా కథకు సంబంధించిన మరిన్ని ఆసక్తికర అంశాలను ప్రేక్షకులకు పరిచయం చేసింది. గ్రామీణ నేపథ్యం, దైవ విశ్వాసాలు, మూఢనమ్మకాలు, యాక్షన్ అంశాలను మేళవిస్తూ ఈ సినిమాను తెరకెక్కించినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. కథ విషయానికి వస్తే.. ఓ సంక్షోభంలో చిక్కుకున్న గ్రామస్తులు తమ గ్రామ దేవత మరెమ్మ తల్లిపై నమ్మకం పెట్టుకుంటారు. అయితే అమ్మవారికి సంబంధించిన పవిత్రమైన ఎద్దు అనూహ్యంగా కనిపించకుండా పోవడంతో గ్రామంలో ఒక్కసారిగా భయాందోళనలు మొదలవుతాయి. ఆ ఎద్దు అదృశ్యం కావడం వెనుక ఏదో పెద్ద కారణం ఉందని గ్రామస్తులు భావిస్తారు. ఈ పరిణామాల నేపథ్యంలో యువ కథానాయకుడిపై ఆ ఎద్దును వెతికి తీసుకురావాల్సిన బాధ్యత పడుతుంది. ఎద్దు కోసం అతడు చేసే అన్వేషణ క్రమంలో ఎన్నో ఊహించని పరిణామాలు ఎదురవుతాయి. గ్రామంలో పాతుకుపోయిన నమ్మకాలు, స్థానిక రాజకీయాలు, ఆధిపత్య పోరాటాలు అతడి ప్రయాణాన్ని మరింత ప్రమాదకరంగా మారుస్తాయి. ఈ క్రమంలో హీరో పలు హింసాత్మక సంఘర్షణల్లో చిక్కుకున్నట్లు ట్రైలర్‌లో చూపించారు. అయితే 'మారెమ్మమ్మ' కథలో అసలు మిస్టరీ ఏమిటన్నది మాత్రం ట్రైలర్‌లో పూర్తిగా రివీల్ చేయలేదు. పవిత్రమైన ఎద్దు ఎందుకు కనిపించకుండా పోయింది? దాని వెనుక ఎవరి హస్తం ఉంది? హీరో ఎదుర్కొనే సమస్యలకు, గ్రామ దేవత నమ్మకాలకు ఉన్న సంబంధం ఏమిటి? అనే ప్రశ్నలను అలాగే ఉంచుతూ ట్రైలర్‌ను ఆసక్తికరంగా కట్ చేశారు. ముఖ్యంగా గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తున్నాయి. ఉత్కంఠభరితమైన సన్నివేశాలకు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరింత బలాన్ని చేకూర్చింది. సాధారణ విలేజ్ డ్రామాకు భిన్నంగా దైవ విశ్వాసం, గ్రామీణ ఆచారాలు, మిస్టరీ, యాక్షన్ అంశాలను కలిపి కథను నడిపించినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో దీపా బాలు కథానాయికగా నటించగా.. వికాస్ వశిష్ట, వినోద్ కుమార్, వీఎస్ రూపలక్ష్మి, దయానంద్ రెడ్డి తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మయూర్ రెడ్డి బండారు నిర్మిస్తున్న ఈ చిత్రానికి మంచాల నాగరాజు దర్శకత్వం వహిస్తున్నారు. ట్రైలర్‌తో సినిమాపై మరింత ఆసక్తిని పెంచిన 'మారెమ్మ' సెప్టెంబర్ 10, 2026న థియేటర్లలోకి రానుంది. గ్రామీణ నేపథ్యంలోని మిస్టరీ, యాక్షన్ కథలను ఇష్టపడే ప్రేక్షకులకు ఈ సినిమా ఎలాంటి అనుభూతిని అందిస్తుందో చూడాలి.

### ఫేక్ ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో

# కరీనా - పృథ్వీరాజ్ 'దైరా'

### ఆకట్టుకుంటున్న ట్రైలర్!




బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ ఖాన్ మరియు టాలెంటెడ్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా క్రైమ్ థ్రిల్లర్ 'దైరా'. ప్రముఖ దర్శకురాలు మేఘనా గుల్జార్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో కరీనా కపూర్ ఖాన్ డీసీపీ అజూని కోహ్లీగా, పృథ్వీరాజ్ సుకుమారన్ డీసీపీ రామన్ కుమార్‌గా ప్రత్యర్థి పోలీసు అధికారులుగా కనిపించనున్నారు. చట్టం వర్సెస్ న్యాయం, నకిలీ ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ అయిన రామన్ కుమార్‌పై మరో పోలీసు అధికారి అజూని కోహ్లీ దర్యాప్తు చేసే తీవ్రమైన సన్నివేశాలతో ట్రైలర్ ఎంతో ఆసక్తికరంగా సాగింది. జంగ్లీ పిక్చర్స్ మరియు పెన్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాను మేఘనా గుల్జార్ యదార్థ ఘటనల ఆధారిత సీరియస్ డ్రామాగా మలిచారు. సస్పెన్స్ మరియు హై-వోల్టేజ్ డ్రామాతో కూడిన ఈ క్రైమ్ థ్రిల్లర్ ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 18న విడుదల కానుండగా, ప్రస్తుతం ఈ ట్రైలర్ సినీ వర్గాల్లో భారీ అంచనాలను పెంచేసింది.



### షాలిని పాండే పేరుతో

# ఫేక్ ఏఐ వీడియో వైరల్..

## తీవ్రంగా స్పందించిన 'అర్జున్ రెడ్డి' హీరోయిన్

సోషల్ మీడియా విస్తృతి పెరుగుతున్న కొద్దీ సెలబ్రిటీలకు సంబంధించిన డీప్‌ఫేక్, ఏఐ జనరేటెడ్ కంటెంట్ కూడా ఆందోళన కలిగించే స్థాయిలో పెరుగుతోంది. ఇప్పటికే పలువురు సినీ తారలు తమ పేరుతో వైరల్ అయిన మార్ఫింగ్ వీడియోలు, ఫేక్ ఫొటోలపై స్పందించిన విషయం తెలిసిందే. తాజాగా 'అర్జున్ రెడ్డి' ఫేమ్ శాలినీ పాండే కూడా డీప్‌ఫేక్ బారిన పడినట్లు వెల్లడించింది. శాలినీ పాండే పేరుతో సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్‌గా మారడంతో ఆమె దీనిపై స్పందించింది. తన పేరుతో చక్కర్లు కొడుతున్న ఆ వీడియో పూర్తిగా నకిలీదని, ఏఐ టెక్నాలజీని ఉపయోగించి రూపొందించారని ఆమె స్పష్టం చేసింది. అందులో కనిపిస్తున్నది తాను కాదని తేల్చి చెప్పింది. టెక్నాలజీని ఉపయోగించి మహిళలను కించపరిచేలా ఇలాంటి ఫేక్ వీడియోలను రూపొందించడం అత్యంత దారుణమని శాలినీ పాండే ఆవేదన వ్యక్తం చేసింది. తన పేరుతో వైరల్ అవుతున్న వీడియోను తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపింది. అలాంటి వీడియోలు కనిపించినప్పుడు వాటిని ఇతరులకు పంపించకుండా, డౌన్‌లోడ్ చేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని ఆమె కోరింది. వీలైనంత త్వరగా ఆ కంటెంట్‌ను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో రిపోర్ట్ చేయాలని సూచించింది. ఫేక్ కంటెంట్‌ను షేర్ చేయడం వల్ల అది మరింత మందికి చేరే అవకాశం ఉంటుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆమె విజ్ఞప్తి చేసింది. సెలబ్రిటీల ముఖాలను ఉపయోగించి అసలు వ్యక్తులకు సంబంధం లేని వీడియోలు, ఫొటోలను రూపొందించడం ఇటీవలి కాలంలో పెద్ద సమస్యగా మారింది. గతంలో రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్, శ్రుతిహాసన్, టబు, ఐశ్వర్య రాయ్ బచ్చన్ తదితర హీరోయిన్ల పేర్లతోనూ డీప్‌ఫేక్ కంటెంట్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. తాజాగా శాలినీ పాండే ఘటన కూడా అదే కోవలోకి చేరింది. దీంతో సెలబ్రిటీల డిజిటల్ భద్రతపై మరోసారి చర్చ మొదలైంది. ఏఐ టెక్నాలజీని సృజనాత్మకంగా ఉపయోగించడంతో పాటు దుర్వినియోగం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా, షాలినీ పాండే 2017లో విజయ్ దేవరకొండ సరసన నటించిన 'అర్జున్ రెడ్డి' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఈ చిత్రంలో ఆమె నటన, సహజమైన ఎక్స్‌ప్రెషన్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత 'మహానటి', '118', 'జయేష్‌భాయ్ జోర్దార్', 'మహారాజ్' వంటి చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465